




రాజీవ్ లింక్ కెనాల్ పనులు పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల

చకచకా రాజీవ్ లింక్ కెనాల్ పనులు

- ఈ ఏడాదే కృష్ణా, గోదావరి జలాల అనుసంధానం పూర్తవుతుంది..
- కృష్ణా జలాలను న్యాయబద్ధంగా పంపిణీ చేయాలి
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఏన్కూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టు పరిధిలోని రాజీవ్ లింక్ కెనాల్ పనులను త్వరలోనే పూర్తిచేస్తామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హామీ ఇచ్చారు. హిమాంనగర్ గ్రామ సమీపంలో గ్యాస్ పైపులైన్ వద్ద జరుగుతున్న లింక్‌కెనాల్ పనులను సోమవారం పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఈ ఏడాదే గోదావరి జలాలను నాగార్జునసాగర్ కెనాల్‌కు అనుసంధానం చేయనున్నామని, తద్వారా ఖమ్మం జిల్లా సస్యశ్యామలం అవుతుందన్నారు. వేసవిలో నీటి ఎద్దడిని తట్టుకునేందుకు ఈ ప్రాంత ప్రజలకు ఈ కెనాల్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కృష్ణాజలాల (మిగతా 6వ పేజీలో)




ఇల్లెందులో మాట్లాడుతున్న ఎంపీ బలరాంనాయక్

సంస్కృతీ సంప్రదాయాలు కాపాడుకోవాలి

- లంబాడా ఆడపడుచులు కులాంతర వివాహాలు చేసుకోవద్దు...
- బంజారాలు వ్యసనాలకు దూరంగా ఉండాలి
- నేను ఏడాది క్రితమే మద్యం అలవాటు మానుకున్నా..
- మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్

6



ఇంటి వద్ద ఖాళీగా ఉంటున్నారా? 'యాప్' ద్వారా చిన్నమొత్తంలో పెట్టుబడి పెడితే రూ.లక్షల్లో నగదు వచ్చి చేరుతుంది.. అలాగే మీరు ఇంకొందరితో పెట్టుబడి పెట్టిస్తే దానికి పదింతలు సంపాదించవచ్చు.. ఎక్కడికి వెళ్లాల్సిన అవసరం లేదు.. ఎక్కడికీ తిరగాల్సిన అవసరం లేదు.. బ్యాంకులో బ్యాలెన్సు.. ఓ స్మార్ట్‌ఫోన్.. అందులో యాప్ ఉంటే చాలు.. డబ్బులే డబ్బులు. సైబర్ మోసగాళ్లు ఇలా గాలం వేసి అనేకమంది అమాయకులు, అత్యాశపరులను ముగ్గులోకి దింపారు. మొదట్లో రాబడి చూపించి నమ్మించారు.. నెట్‌వర్క్ ద్వారా ఎక్కువ మందిని చేర్పించిన వారికి, పెద్ద ఎత్తున పెట్టుబడి పెట్టిన వారికి ట్రిప్‌ల పేరుతో విమానాలు ఎక్కించి దుబాయ్, గోవా వంటి ప్రాంతాలకు తిప్పారు. ఆ తర్వాత..

ఈ మోసం యాప్‌రూపం!

- స్వల్పకాలంలో రెండింతలు, మూడింతలు లాభాలు వస్తాయని ప్రచారం
- అత్యాశతో యాప్‌ల ద్వారా లక్షల్లో పెట్టుబడులు పెడుతున్న పలువురు
- కొన్నిరోజుల పాటు ఆదాయం ఇచ్చి, తర్వాత వ్యాలెట్లను తొలగిస్తున్న సైబర్ మోసగాళ్లు
- 'మీటా ప్లస్' ట్రేడింగ్ పేరుతో రూ.కోట్లు స్వాహా
- చైన్ లింకుల కారణంగా పెరుగుతున్న బాధితుల సంఖ్య
- విచ్చలవిడిగా పుట్టుకొస్తున్న దొంగ యాప్‌లు
- ఖమ్మం జిల్లాతోపాటు ఇతర జిల్లాల్లోనూ బాధితులు

ఆన్‌లైన్‌లో క్రిప్టో కాయిన్స్ ఎర వేసి జనం జేబులు లూటీ

ఖమ్మం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కొంచెం పెట్టుబడి పెట్టండి.. రెండింతలు, మూడింతల లాభాలు పొందండి.. అంటూ ముగ్గులోకి దించి, కొన్నాళ్లు లాభాల ఆశ చూపి ఎక్కువ మొత్తంలో నగదు సమకూరిన తర్వాత యాప్‌లో నగదు లావాదేవీలు నిలిపివేసి నిర్వాహకులు మాయం అయ్యారు. ఇంకేముంది అసలు కథ అర్థం కావడంతో.. రూ.లక్షల్లో పెట్టుబడులు పెట్టిన వారు, తమకు తెలిసిన వారిచే రూ.కోట్లలో పెట్టుబడులు పెట్టించిన వారు లబోదిబోమంటున్నారు. ఖమ్మం జిల్లాలో మీటా ప్లస్ పేరుతో సాగిన క్రిప్టో ట్రేడింగ్ మోసం తాజాగా వెలుగులోకి వచ్చింది. ఇందుకు సంబంధించి కొద్ది రోజుల క్రితం ఖమ్మం అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు కాగా.. రెండు రోజుల క్రితం మరికొందరు బాధితులు ఖమ్మం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మూడింతల లాభాల పేరుతో ఎర...

డిజిటల్ కరెన్సీగా చలామణి అవుతున్న క్రిప్టో కరెన్సీకి సంబంధించి బిట్ కాయిన్, ఇథేరియమ్, ట్రాన్ వంటి పలు రకాల కాయిన్లు కొనుగోలు చేస్తే భవిష్యత్తులో దానికి విలువ పెరిగి రూ.లక్షలు, కోట్లు వచ్చే అవకాశం ఉందని ప్రచారం చేస్తున్నారు. కాయిన్లను కొనుగోలు చేయడం కోసం పలు రకాల వాలెట్‌లను ఏర్పాటు చేశారు. వాటిని ఉపయోగించి కాయిన్లను కొనుగోలు చేసే సమయంలో మోసగాళ్లు నగదును కొల్లగొట్టేస్తున్నారు.

దొంగ వ్యాలెట్లను తయారుచేసి తాము ఇచ్చిన లింకుల ఆధారంగా వ్యాలెట్లను డౌన్‌లోన్ చేయించి పెట్టుబడులు పెట్టించడం ప్రస్తుతం జరుగుతున్న క్రిప్టోమోసాల్లో కీలక అంశం. తమకు చెందిన వాలెట్లలో నగదు పెడితే.. తదనుగుణంగా ఆదాయం ఉంటుందంటూ పలు రకాల ప్యాకేజీలకు సంబంధించిన డెమోలను ఇచ్చి వాటిల్లో నగదు పెట్టేలా చేస్తున్నారు. అలా 'మీటాప్లస్' అనే క్రిప్టో వాలెట్‌లో ఏడు ప్యాకేజీలను ప్రకటించిన నిర్వాహకులు.. రెండింతలు, మూడింతల లాభాలను ప్రకటించారు. రూ.లక్షలోపు నగదు పెట్టిన వారికి పది నెలల్లో రెండింతలు, ఆపై పెట్టుబడి వారికి 15 నెలల్లో మూడింతలు నగదు తిరిగి ఇస్తామని ప్రకటించారు. దీంతో అత్యాశతో ఖమ్మం జిల్లాలో వెయ్యిమందికి పైగా రూ.100 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టినట్టు తెలిసింది. ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఏపీలోని విజయవాడ, గుంటూరు ప్రాంతాల్లోనూ పలువురు ఈ స్కీమ్‌కు ఆకర్షితులైనట్టు తెలుస్తోంది. ఖమ్మం నగరానికి చెందిన ఓ మహిళ (మిగతా 6వ పేజీలో)



నేటి సాయంత్రం నుంచి సెక్షన్ 163

- ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పలు ఆంక్షలు
- రెండు రోజుల పాటు మద్యం షాపులు బంద్
- నేటితో ఎన్నికల ప్రచారానికి తెర

ఖమ్మం క్రైం/కొత్తగూడెం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న నిర్వహించనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ఖమ్మం కమిషనరేట్ పరిధిలో సెక్షన్ 163బీఎన్ఎస్ఎస్ యాక్ట్ అమలులో ఉంటుందని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ తెలిపారు. మంగళవారం సాయంత్రం 6 గంటల నుండి 27న సాయంత్రం 6గంటల వరకు ఆంక్షలు అమలులో ఉంటాయని, ఐదుగురి కంటే ఎక్కువ మంది గుంపులుగా ఉండరాదని పేర్కొన్నారు. రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేయటం, కవ్వింపు చర్యలకు పాల్పడటం చేయరాదని సూచించారు. ఎవరైనా ఎన్నికల నియమాలను ఉల్లంఘించినా, అతిక్రమించినా చట్ట వ్యతిరేకంగా ప్రవర్తించినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

డబ్బు, మద్యం ఉచిత కానుకల ద్వారా ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడంతో పాటు ఓటర్లను భయభ్రాంతులకు గురి (మిగతా 6వ పేజీలో)



డిప్యూటీ సీఎం పీఏ హఠాన్మరణం

- నివాళులర్పించిన మంత్రులు తుమ్మల, భట్టి
- గత ఆరేళ్లుగా భట్టి వద్ద పనిచేస్తున్న శ్రీనివాసరావు

ఖమ్మంసంక్షేమ విభాగం/ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వ్యక్తిగత సహాయకుడు (పీఏ) తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు (50) సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. ఖమ్మం ఏదులాపురం (మిగతా 6వ పేజీలో)

వెల్లువెత్తెను మిర్చి.. అంచనాలను మించి..

ఖమ్మం మార్కెట్‌కు సీజన్‌లో తొలిసారి 1.20 లక్షల బస్తాల రాక



ఖమ్మం మార్కెట్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని వ్యవసాయ మార్కెట్‌కు ఎర్రబంగారం (తేజ రకం మిర్చి) పోటెత్తింది. మార్కెట్‌కు సోమవారం సుమారు లక్షా 20వేల మిర్చిబస్తాలు అమ్మకానికి వచ్చాయి. వానాకాలం(ఖరీఫ్)మిర్చి సీజన్ ప్రారంభమైన తరువాత తొలిసారి పంట ఇంత భారీ మొత్తంలో మార్కెట్‌కు వచ్చింది. మార్కెట్‌కు గత వారం రోజులుగా 60నుంచి 80 వేల బస్తాలు అమ్మకానికి వస్తుండగా, మిర్చి యార్డులకు శని, ఆదివారాలు వరుసగా రెండు రోజులు సెలవులు రావడంతో సోమవారం రైతులు భారీగా పంటను అమ్మకానికి తీసుకొచ్చారు. ఈ మార్కెట్‌కు ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు మహబూబాబాద్, సూర్యాపేట, ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా నుంచి రైతులు తమ పంటను అమ్మకానికి తీసుకొస్తున్నారు. ఆదివారం సాయంత్రం నుంచే మార్కెట్‌కు పంట తోలకాలు ప్రారంభం కావడంతో సోమవారం ఉదయం 6గంటలకే పత్తి, మిర్చి యార్డులు పూర్తిగా నిండిపోయాయి. ఇదిలా ఉండగా మార్కెట్లో సోమవారం క్వింటాలు మిర్చికి రూ.14,125 జెండాపాట నిర్ణయించగా, వ్యాపారులు నాణ్యతనుబట్టి క్వింటాలుకు కనిష్ఠంగా రూ.10,000, గరిష్ఠంగా రూ.13,800 వరకు కొనుగోలు చేశారు. మిర్చి కొనుగోళ్లను మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హన్మంతరావు, వైస్ చైర్మన్ తల్లాడ రమేష్, సెక్రెటరీ ప్రవీణ్‌రెడ్డి, గ్రేడ్‌టూ సెక్రెటరీ సృజన్‌బాబు, అసిస్టెంట్ సెక్రెటరీ వీరాంజనేయులు తదితరులు సమీక్షించారు.



పకడ్బందీగా వార్షిక పరీక్షలు

- మార్చి 5 నుంచి 25 వరకు ఇంటర్ పరీక్షలు
- మార్చి 21 నుంచి ఏప్రిల్ 4 వరకు పది పరీక్షలు
- నిర్వహణపై అధికారులతో అదనపు కలెక్టర్ సమీక్ష

ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెలలో ఇంటర్, పదో తరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఇంటర్, పదో తరగతి పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 5 నుంచి 25వరకు ఇంటర్ పరీక్షలు, మార్చి 21 నుంచి ఏప్రిల్ 4 వరకు పదవ తరగతి పరీక్షల (మిగతా 6వ పేజీలో)

తవ్వుకో... దండుకో...

- ఎన్నెస్పీ కాల్వకట్టల వద్ద అక్రమంగా మట్టి తవ్వకాలు
- రాత్రివేళల్లో వందల ట్రాక్టర్లతో తరలింపు
- ఎన్నెస్పీ-21 ఎంబీసీకి పొంచి ఉన్న ప్రమాదం
- కట్టలు తెగితే లక్షలాది ఎకరాల్లో పంటలకు నష్టం
- అధికార పార్టీ నేతల పేర్లు చెప్పి దందా
- అధికారులకు సవాల్‌గా నియంత్రణ

కొణిజర్ల, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మట్టి అక్రమ రవాణా ధాటికి గట్లు, గుట్టలే కాకుండా ఎన్నెస్పీ కాల్వలు కూడా కరిగిపోతున్నాయి. యథేచ్ఛగా గ్రావెల్ తవ్వకాలు చేస్తూ అక్రమార్కులు రెండు చేతులా సంపాదిస్తున్నారు. లక్షలాది ఎకరాలకు సాగునీరందిస్తున్న ఎన్నెస్పీ-21 మెయిన్ బ్రాంచ్ కెనాల్ కాల్వకట్టలకు రక్షణగా ఉన్న మట్టిని సైతం అక్రమంగా తవ్వి తరలిస్తున్నారు. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం నుంచి ఏన్కూరు మండలం వరకు ఎన్నెస్పీ-21 మెయిన్ బ్రాంచ్ కెనాల్ కట్ట నుంచి యథేచ్ఛగా మట్టి తోలకాలు సాగుతున్నాయి. ప్రతిరోజు వందలాది ట్రాక్టర్లతో ఎంబీసీపై ఉన్న మట్టిని అక్రమంగా తరలిస్తూ కొంత మంది సొమ్ము చేసుకుంటున్నారు. తమకు అధికార పార్టీ నాయకుల అండదండలు ఉన్నాయని చెబుతూ నీటిపారుదలశాఖ అధికారులను లెక్కచేయడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మట్టి అక్రమ తవ్వకాలతో కాల్వకట్టలపై గుట్టలుగా ఉన్న మట్టి నేడు కట్టకు సమానంగా మారింది. మట్టిని తవ్వినచోట లోతుగా గుంతలు ఏర్పడటంతో పశువులు ప్రమాదాల బారిన పడుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



21వ ఎంబీసీ కాల్వకట్టల నుంచి తరలిన మట్టి

కరుగుతున్న కాల్వ కట్టలు..

ఎన్నెస్పీ ప్రధానకాల్వకు ఇరువైపుల కట్టలకు రక్షణగా ఉండేందుకు గుట్టలుగా మట్టిని నిల్వ ఉంచారు. ఎంబీసీ-21కి 13వ కిలోమీటర్ నుంచి మొదలు కొని ఏన్కూర్ మండలం వరకు కట్టలపై భారీగా మట్టి ఉంది. కాల్వ కట్టలు బలహీనపడకుండా ఆ మట్టిని ఉంచారు. అలాగే ఎప్పుడైనా కట్టలకు మరమ్మతులు చేయాల్సి వస్తే ఆ మట్టినే ఉపయోగించుకునేలా ఉంచారు. అటువంటి మట్టిపై అక్రమార్కుల కన్ను పడింది. అడిగేవారు లేరన్నట్లు ప్రధానకాల్వ సమీపంలోని గ్రామాల వారు ఎక్స్‌కవేటర్లతో మట్టిని తవ్వి ట్రాక్టర్ల ద్వారా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికే వేలాది ట్రాక్టర్ల మట్టి తరలిపోయిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ మట్టిని రక్షించాల్సిన అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

మట్టి అక్రమ తోలకాలను అదుపుచేయడం అధికారులకు సవాల్‌గా మారింది. ఇటీవలే మట్టితోలకాలు (మిగతా 6వ పేజీలో)

సాగర్ ఆయకట్టుకు సాగునీరు

దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద నీటి లభ్యతను పరిశీలించిన భద్రాద్రి కలెక్టర్

అశ్వాపురం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఎన్నెస్పీ లింక్ కెనాల్ ద్వారా సాగర్ ఆయకట్టుకు రబీలో గోదావరి నీటిని తరలించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇందు కోసం సీతారామ ప్రాజెక్ట్ ద్వారా ఎన్నెస్పీ ఆయకట్టుకు నీటిని తరలించే క్రమంలో సోమవారం కలెక్టర్ జితేష్ వి.పాటిల్ దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద నీటినిల్వను పరిశీలించారు. గోదావరిలో నీటి లభ్యత తక్కువగా ఉండటంతో ఎగువన ఉన్న సమ్మక్క బ్యారేజ్ నుంచి 1200 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు నిర్ణయించారు. మరో మూడు రోజుల్లో బ్యారేజ్ నుంచి దుమ్ముగూడెం ఆనకట్ట వద్దకు గోదావరి జలాలు చేరుకోనున్నాయి. అనంతరం సీతారామ పంప్‌హౌస్‌లు రన్ చేసి ఎన్నెస్పీ కెనాల్‌కు నీటిని మళ్లించాలని ప్రణాళికలు సిద్ధం చేయాలని నీటిపారుదల శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో నీటిపారుదలశాఖ ఎస్ఈలు శ్రీనివాసరెడ్డి, రవికుమార్, ఈఈ వెంకటేశ్వరరావు, డీఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం పీఏ హఠాన్మరణం

(5వ పేజీ తరువాయి)
టీఎన్జీవో కాలనీలోని తన నివాసంలో ఉన్న శ్రీనివాసరావు... సోమవారం ఉదయం కొంత అలసటగా ఉందని, కడుపులో గ్యాస్ పట్టేసినట్లు ఉందని కుటుంబ సభ్యులకు తెలిపాడు. అనంతరం సమీపంలోనే ఉన్న ఓ ఆర్ఎంపీ వద్దకు వెళ్లి ఇంజక్షన్ చేయించుకొని మెరుగైన వైద్యం కోసం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తన బైక్‌పై బయలుదేరాడు. కొంతదూరం వెళ్లిన తర్వాత ఉపశమనం కలిగినట్లు అనిపించడంతో, ఆస్పత్రికి వెళ్లకుండా తిరిగి ఇంటికి చేరుకున్నాడు. అయితే కొద్దిసేపటికే వాంతులు చేసుకొని కుప్పకూలి మృతిచెందాడు.

శ్రీనివాసరావు గత 20 ఏళ్లుగా ఐసీడీఎస్ శాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఆరేళ్లుగా డిప్యూటేషన్‌పై ఉప ముఖ్యమంత్రి కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు.


నివాళులర్పిస్తున్న మంత్రి తుమ్మల


నివాళులర్పిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి

కాగా, శ్రీనివాసరావు మృతి వార్త తెలుసుకున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కాంగ్రెస్ నాయకురాలు, అమ్మ ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుంటుపల్లి శ్రీనివాసరావు, బుల్లెట్ శ్రీనివాసరావు, నాయకులు తాళ్లూరి శ్రీకాంత్ తదితరులు వచ్చి.. శ్రీనివాసరావు భౌతికకాయానికి నివాళులర్పించారు. ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి సంతాపం ప్రకటించారు. శ్రీనివాస్ మరణంతో టీఎన్జీవో ఒక నిబద్ధత గల సభ్యుడిని కోల్పోయిందని టీఎన్జీవోస్ నేతలు నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. శ్రీనివాస్ కుటుంబానికి టీఎన్జీవోస్ యూనియన్ అండగా ఉంటుందని తెలిపారు. కాగా, శ్రీనివాసరావు అంత్యక్రియలు మంగళవారం జరుగుతాయని కుటుంబసభ్యులు తెలిపారు.

సంస్కృతీ సంప్రదాయాలు కాపాడుకోవాలి

ఇల్లెందు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): బంజారాల సంస్కృతి సంప్రదాయాలు కాపాడుకోవాలని, లంబాడా ఆడపడుచులు కులాంతర, మతాంతర వివాహాలు చేసుకోవద్దని మహబూబాబాద్ పార్లమెంటు సభ్యుడు పోరిక బలరాం నాయక్ కోరారు. ఇల్లెందులో సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాల ముగింపు వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ఎంపీ బలరాంనాయక్ మాట్లాడుతూ లంబాడా భాషను రాజ్యాంగంలో ఎనిమిదవ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. సేవా లాల్ ప్రబోధనలు అనుసరణీయం అన్నారు. తాను ఏడాది క్రితమే మద్యం అలవాటు మానుకున్నానని. లంబాడాలు మద్యం ధూమపానం, గంజాయి తాగడం లాంటి దురలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. ఇందిరమ్మ చలువతో ఎస్టీలు గా మారామని అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఉద్బోధించారు.

ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ సంచార జాతులుగా ఉన్న బంజారాలు సేవా లాల్ బోధనల ద్వారా స్థిర నివాసాలు తండాలుగా ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధి కోసం చేపడుతున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కార్యక్రమంలో మాజీ మునిసిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు. భోజ్ మహరాజ్. మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు. మాజీ చైర్మన్ భూక్యా నాగేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు భూక్యా దళ్ సింగ్, పులి సైదులు, దొడ్డ దానియేలు, బానోత్ రవినాయక్, ప్రేమ్ చంద్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు పట్టణంలో వందలాది మంది బంజారాలు సాంప్రదాయ పద్ధతిలో శోభాయాత్ర జరిపారు. భోగ్ బండార్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తీర్థాల జాతర ఏర్పాట్లు పూర్తి

- వాహనదారులు ఈ రూట్‌లలో ప్రయాణించండి
- పోలీస్ కమిషనర్ సునీల్‌దత్



ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని తీర్థాల జాతరకు వచ్చే వాహనదారులకు, భక్తులకు ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ సోమవారం ఓ ప్రకటనలో పలు సూచనలు చేశారు. ఖమ్మం నగరం వైపునుంచి వచ్చే వాహనాలు దానవాయిగూడెం, రామన్నపేట, కామంచికల్ మీదుగా వచ్చి కామంచికల్ మున్నేరు వాగు బ్రిడ్జ్ రోడ్డుకి ఇరువైపుల సూచించిన పార్కింగ్‌లో ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు పార్కింగ్ చేసుకోవాలన్నారు. ట్రాక్టర్లు, లారీలు కామంచికల్, పాటివారిగూడెం నుంచి జాన్‌బాద్ తండా వెళ్లే దారిలో కామంచికల్ బ్రిడ్జి దగ్గర పార్కింగ్ స్థలంలో వాహనాలు పార్కింగ్ చేయాలన్నారు. డోర్నకల్, పాపటపల్లి మీదుగా వచ్చే వాహనాలు కామంచికల్ గ్రామానికి ముందు చెరువు వద్ద కుడివైపు ఉన్న జామాయిల్ తోట వద్ద గల పార్కింగ్‌లో వాహనాలు నిలపాలని సూచించారు. మద్దివారిగూడెం, మంగళగూడెం వైపు నుంచి వచ్చే వాహనాలు తీర్థాల గ్రామ ప్రవేశం వద్ద వాహనాలు నిలుపుకోవాలన్నారు. కురవి, ములకలపల్లివైపు నుంచి వచ్చే వాహనాలు యం.వి పాలెం, గుండాలతండా మీదుగా తీర్థాలకు చేరుకోవాలన్నారు. ఖమ్మం రూరల్ నుంచి వచ్చే వాహనాలు, కార్లు పల్లెగూడెం, గోళ్లపాడు మీదుగా ఆకేరు బ్రిడ్జి ప్రక్కన పార్క్ చేయాలన్నారు. వాహనాలు చెప్పిన రూట్‌లలో మాత్రమే ప్రయాణించాలని వేరే రూట్‌లలోకి వచ్చి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించవద్దని, వాహనదారులకు సూచించారు. పోలీసులకు వాహనదారులు సహకరించాలని కోరారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్ : సీపీ

ఖమ్మంక్రైం: మతసామరస్యానికి ప్రతి ఒక్కరు పాటుపడాలని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ అన్నారు. మార్చి 2 నుంచి ప్రారంభం కానున్న రంజాన్ ఉపవాస దీక్షల సందర్భంగా సీపీ కార్యాలయంలో సోమవారం ముస్లిం మతపెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ మతసామరస్యానికి ప్రతీకగా ఖమ్మం జిల్లా ఉందని, సోదరభావంతో పరస్పరం మతాలను గౌరవించుకుంటూ మెలగడం జిల్లాలో మంచి సాంప్రదాయమన్నారు. ఇదే స్ఫూర్తితో రంజాన్ ఉపవాస దీక్షలను శాంతియుత వాతావరణంలో జరపాలని కోరారు. ఏమైనా ఇబ్బందులుంటే పోలీసుశాఖ దృష్టికి తేవాలన్నారు. చోరీలు జరగకుండా సీసీఎస్ పోలీసులు, ఈవ్‌టీజింగ్ జగరకుండా షీటీంలు అందుబాటులో ఉండాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఏడీసీపీ ప్రసాదరావు, ఏసీపీ రమణమూర్తి, సీఐ ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.


టెన్నిస్ ఆడుతున్న మంత్రి తుమ్మల

జాతీయ టెన్నిస్ పోటీలను సందర్శించిన మంత్రి తుమ్మల

ఖమ్మం స్పోర్ట్స్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంనగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో జరుగుతున్న ఆల్ ఇండియా ఓపెన్ టెన్నిస్ పోటీలను సోమవారం రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సందర్శించారు. ఈ సందర్భంగా కొద్దిసేపు టెన్నిస్ ఆడి సందడి చేశారు. ఆయన టెన్నిస్ కోర్టులకు రావడంతోనే అక్కడి లాంజ్‌లో ఉన్న చిన్నారులు కేరింతలతో స్వాగతం పలికారు. దీంతో వారికి అభివాదం చేసుకుంటూ ముందుకు సాగారు తుమ్మల. కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి జిల్లా టెన్నిస్ అసోసియేషన్ బాధ్యులు మద్దినేని వెంకటరమణ, చల్లపల్లి శ్రీనివాస్, డాక్టర్ అనిల్, కాంపాటి సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

త్వరలో శివారు మండలాలకు బీటీ రోడ్లు

- స్టేట్ వైల్డ్ లైఫ్ సమావేశంలో కీలక అంశాలపై చర్చ
- టూరిజం కింద మరింత అభివృద్ధి
- పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

మణుగూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యలను స్టేట్ వైల్డ్‌లైఫ్ బోర్డు దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి ఆమోదం పొందినట్టు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం ఆయన ఫోన్‌లో 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.సోమవారం హైదరాబాద్‌లో అంబేద్కర్ సచివాలయంలో స్టేట్‌బోర్డు వైల్డ్ లైఫ్ బోర్డు సమావేశాన్ని నిర్వహించారన్నారు. ఈ సమావేశానికి అటవీశాఖ మంత్రి కొండా సురేఖ హాజరయ్యారన్నారు. నియోజకవర్గంలో రహదారుల నిర్మాణానికి ప్రధాన అడ్డంకిగా ఉన్న అటవీ సమస్యలను బోర్డు దృష్టికి తీసుకెళ్లినట్టు ఆయన తెలిపారు. అదేవిధంగా ఎకో టూరిజం కింద అభివృద్ధి చేయాలని స్థానిక నిరుద్యోగ యువత, స్వయం సహాయక గ్రూపులకు ఉపాధి అవకాశాలను కల్పించే లక్ష్యంగా తుమ్మల చెరువు, రేగులగండి చెరువులను అభివృద్ధి చేయాలని కోరడం జరిగిందన్నారు. పోడుపట్టాలు పొందిన వారందరికీ కరెంట్, బోరు, మోటర్ సదుపాయాలు కల్పించాలని, అర్హత ఉండి పట్టాలు రానివారికి పట్టాలిచ్చి సమస్యకు పరిష్కారం చూపాలని కోరి ఈ విషయాలన్నిటిపై తీర్మానం చేయడం జరిగిందన్నారు. త్వరలోనే వీటి అనుమతులు లభించనున్నాయని తెలిపారు. గొత్తికోయ గ్రామాల అభివృద్ధికి శాశ్వత పరిష్కారం చూపాలని కోరడం జరిగిందన్నారు.

2న కమ్మ సంఘం నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం

ఖమ్మం ఖానాపురంహవేలి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నికైన కమ్మ సంఘం నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణస్వీకారం మార్చి 2న నగరంలోని స్వర్ణభారతి కల్యాణమండపంలో సాయంత్రం నిర్వహిస్తున్నట్లు కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కొల్లు రఘు సత్యనారాయణ, చావా రాములు తెలిపారు. దీనికి సంబంధించి సోమవారం తుమ్మల నాగేశ్వరరావును మంత్రి క్యాంపు కార్యాలయంలో నూతన కమిటీ కార్యవర్గ సభ్యులు కలిసి ప్రమాణస్వీకార ఆహ్వాన పత్రికను అందించారు. ప్రమాణస్వీకారానికి ముఖ్య అతిథిగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, గౌరవ అతిథులుగా రాజ్యసభ సభ్యురాలు గారపాటి రేణుకాచౌదరి, ఆధ్యాత్మిక వేత్త గొట్టిపాటి సత్యవాణి, ఆత్మీయ అతిథులుగా మేయర్ నీరజ, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు, మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, టీడీపీ రాష్ట్ర నాయకుడు వాసిరెడ్డి రామనాథం, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణతోపాటు పలువురు ప్రముఖులు హజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ముందుగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బీటీపీఎస్ పనులపై కలెక్టర్ సమీక్ష

మణుగూరు రూరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): బీటీపీఎస్‌లో జరుగుతున్న పనుల పనితీరుపై భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సోమవారం రాత్రి సమీక్షాసమావేశం నిర్వహించారు. ప్లాంటులో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ప్లాంటు సీఈ బిచ్చన్న ప్లాంటులో జరుగుతున్న పనుల పనితీరుపై కలెక్టరుకు వివరించారు. పెండింగ్ పనులను త్వరతగతిన పూర్తిచేయాలని స్థానికులకు ప్లాంటులో ఉపాధిఅవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పాటిల్ ఆదేశించారు. కార్యక్రమంలో సీఈ బిచ్చన్న, ఎస్ఈ రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఈ మోసం... 'యాప్' రూపం!

(5వ పేజీ తరువాయి)
రూ.14లక్షలు పెట్టుబడి పెట్టగా, మరో వ్యక్తి తనతోపాటు మరికొంతమందితో రూ.27లక్షల వరకు పెట్టుబడి పెట్టించారు. మొదట్లో కొద్ది రోజులపాటు నగదు చెల్లిస్తున్న సదరు కేటుగాళ్లు కొద్ది రోజుల తర్వాత ఏకంగా వాలెట్లనే ఎత్తేస్తున్నారు. ఇలా ఒకదాని తర్వాత మరొకటి మార్కెట్‌లోకి తీసుకొచ్చి మోసాలకు పాల్పడుతున్నట్టుగా తెలుస్తోంది.

చైన్‌లింకులు

వాలెట్లలో డెమోలు ఇస్తూ చైన్ స్కీంలను ప్రవేశపెట్టడంతో నష్టపోతున్నవారి సంఖ్య తెలుగు రాష్ట్రాల్లో వందలసంఖ్యకు చేరిపోయింది. మొదట డెమోలు ఇచ్చిన సమయంలో ప్యాకెజీలతో పాటుగా తమ రిఫరల్ ద్వారా వేరేవారితో నగదు పెట్టిస్తే 10శాతం బోనస్ వస్తుందని చెబుతుండటంతో ఆయా వాలెట్లలో పెట్టుబడులు పెట్టినవారు మరికొంత మందిని ప్రేరేపిస్తున్నారు. నిర్వాహకులు పకడ్బందీ వ్యూహంతో నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకుని క్రిప్టోకరెన్సీ పేరుతో నగదు దోచేసి వాలెట్లను ఎత్తేస్తున్నారు. మొదట్లో ఇది పట్టణాలకే పరిమితం కాగా, ప్రస్తుతం పల్లెలకు సైతం విస్తరించింది. వాలెట్లలో నష్టపోయిన వారిలో సామాన్య, మధ్యతరగతి ప్రజలే ఎక్కువగా ఉండటం గమనార్హం.

కాగా, వాలెట్లు ఎత్తేసిన తర్వాత రిటర్న్స్ రాకపోవడంతో తమను ఆయా వాలెట్లలో నగదు పెట్టించిన వారి వద్దకు వెళ్లి నగదు తమకు ఇవ్వాలని బాధితులు ఒత్తిడి చేస్తున్నారు. అయితే యాప్‌లు ఎత్తేసిన సమయంలో చైన్ లింకులో పైన ఉన్నవారు లబ్ధి పొందుతున్నట్టుగా ప్రచారం జరుగుతోంది. చైన్‌లింకులో భాగంగా మొదటినుంచి చివరిస్థాయి వ్యక్తి వరకు పెట్టిన పెట్టుబడులకు తగ్గట్టుగా అత్యధిక స్థాయిలో రిఫరల్ బోనస్‌లు పొంది పెద్ద ఎత్తున నగదును వెనకేసుకున్నట్టుగా తెలుస్తోంది. అనంతరం యాప్ ఎత్తేసిన సమయంలో కిందిస్థాయివారితో పాటు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి యాప్ నిర్వాహకులపై ఫిర్యాదులు చేస్తున్నారని తెలిసింది.

గతంలో ఒకరి ఆత్మహత్య

గతంలో ఖమ్మం జిల్లాలో ట్రూ వాలెట్, ట్రస్ట్ వాలెట్ వంటి పలు యాప్‌ల ద్వారా చైన్ స్కీములు ఏర్పాటుచేసి క్రిప్టో కరెన్సీ పేరుతో మోసాలకు పాల్పడిన సంఘటన వెలుగులోకి వచ్చింది. సంబంధిత వాలెట్ల ద్వారా ఒక్కో ఐడీకి రూ.3.75 లక్షలు కట్టించుకోగా.. రెండు నెలల్లో కట్టిన నగదు తిరిగి వస్తుందని, ఆ తర్వాత మరో నాలుగు నెలలు పెట్టిన నగదుకు రెండింతలు లాభాలు వస్తాయని చెప్పి చివరకు ఏకంగా యాప్‌నే ఎత్తేశారు. దాంతో తెలుగురాష్ట్రాల్లో వందలమంది తమ నగదును కోల్పోయారు. ఈ మోసంలో వాలెట్లకు సంబంధించి ఇద్దరిపై కేసు నమోదు చేసి ఒకరిని అరెస్ట్ చేసి రిమాండ్ చేశారు. ఖమ్మం నగరానికి చెందిన గుడిమెడ రామలింగస్వామి అనే వ్యక్తి క్రిప్టో కరెన్సీ చైన్ స్కీంలో కాయిన్లను కొనుగోలు చేశాడు. అయితే సైబర్ మోసగాళ్లు ఆ వాలెట్ ఎత్తేయడంతో తిరిగి నగదు రాలేదు. దీంతో ఆయనపై కొనుగోలుదారులు ఒత్తిడి తీసుకునిరాగా సూర్యాపేట లాడ్జిలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. క్రిప్టో మోసాలపై పోలీసులు దృష్టిసారించని కారణంగానే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని బాధితులు ఆందోళన చెందుతున్నారు.

రూ.3.75 లక్షలకు రూ.7లక్షలట

నగటు మనుషుల్లోని అత్యాశను ఆసరా చేసుకొని కొందరు వ్యక్తులు.. తమకు తెలిసిన వారితో వాలెట్లలో నగదు పెట్టుబడులు పెడుతున్నారు. వాస్తవానికి వాలెట్లు నకిలీవని తెలిసినా, తమకు కమీషన్లు వస్తుండటంతో డెమోలు ఇచ్చి రూ.కోట్లలో పెట్టుబడులు పెట్టిస్తున్నారు. వీరికి దొంగ వెబ్‌సైట్లు తయారు చేసిన వారితో లింకులు కూడా వున్నట్లు అనుమానాలున్నాయి. వాలెట్లలో నేరుగా ఇండియన్ కరెన్సీ రూపంలో కొనుగోలు కుదరదని, డాలర్ల రూపంలోనే కాయిన్లను కొనుగోలు చేయాల్సి ఉంటుందని... వాటికి సంబంధించి పర్సంటేజీల రూపంలో డబ్బులు వెనక్కి వస్తాయని చెబుతున్నారు. గతంలో 'ఈఎస్‌పీఎన్ గ్లోబల్' పేరిట ఉన్న వాలెట్‌లో నగదు పెట్టించి పెట్టుబడులకు తగిన ఫలితంగా కొంత నగదును అప్పగించి ఆశ చూపించారు. ఆ తర్వాత ప్లేస్టోర్‌లో ఉండే ఓ వాలెట్‌కు వేరే దేశం పేరిట ఉన్న సైట్‌ను చూపించి అందులో పెట్టుబడులు పెడితే మరిన్ని డబ్బులు వస్తాయని, బేసిక్, స్టాండర్డ్, అడ్వాన్స్, ప్రీమియం, క్రౌన్, అల్ట్రా, కోర్, ప్లాటినం అంటూ రకాలు వున్నాయని చెబుతూ 5 వేల డాలర్లు పెడితే రోజుకు 250 డాలర్ల వరకు సంపాదించే అవకాశం ఉందని ఎర వేస్తున్నారు. ఇండియన్ కరెన్సీలో రూ.3.75 లక్షలు పెడితే రూ.28లక్షలు వస్తాయని, రూ.7లక్షల వరకు పెడితే రూ.56 లక్షల వరకు వస్తాయంటూ డెమోలు ఇచ్చి అనేకమందిని ముగ్గులోకి దించినట్టు సమాచారం. చైన్ స్కీంల ద్వారా మరింత సంపాదించొచ్చని, ఒక్కో రిఫరల్‌కి 10శాతం వరకు బోనస్ వస్తుందంటూ కాయిన్లను కొనుగోలు చేసేలా ప్రేరేపించినట్టు తెలిసింది.

చకచకా రాజీవ్ లింక్ కెనాల్ పనులు

(5వ పేజీ తరువాయి)
పంపకాల విషయంలో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని ఆయా రాష్ట్రాలకు తగిన విధంగా పంపకాలు జరిపి రాష్ట్రాలకు న్యాయం చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం కేఆర్ఎంబీ కృష్ణాజలాల వాటాలను తేల్చి తెలంగాణ ప్రాంతానికి రావాల్సిన వాటాను తేల్చాలని అన్నారు. శ్రీశైలం నాగార్జునసాగర్ ప్రాజెక్టుల్లో ఏపీ రాష్ట్రం ఎక్కువ నీటిని వాడుకుంటుందని తెలంగాణకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నీటి వాటాల విషయాన్ని తేల్చుకునేందుకు సిద్ధంగా ఉందన్నారు. రాష్ట్ర రైతాంగం నష్టపోక మునుపే నీటి పంపకాలు తేల్చి నీటిని విడుదల చేయాలని కోరారు. రాజీవ్ లింక్‌కెనాల్ పూర్తయితే వైరా, మధిర, సత్తుపల్లి ప్రాంతాలకు నీటి ఇబ్బంది తొలిగిపోతుందన్నారు. భూములు కోల్పోయిన రైతులకు తగిన నష్టపరిహారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు శోభన్ నాయక్, కట్టా సత్యనారాయణ, కాంట్రాక్టర్ మొగలి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

సీతారామ ప్రాజెక్టు పంప్‌హౌస్ పరిశీలన

ములకలపల్లి (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలంలోని పూసుగూడెం సీతారామ ప్రాజెక్టు పంప్‌హౌస్ వద్ద నీటిని ఎత్తిపోసే స్థలం (డెలివరి పాయింట్) కాల్వలను సోమవారం మంత్రి తుమ్మల పరిశీలించారు. గండుగులపల్లి నుంచి పాల్వంచకు వెళ్తూ పూసుగూడెం ప్రాజెక్టు పంప్ హౌస్‌ను పరిశీలించారు.

పకడ్బందీగా వార్షిక పరీక్షలు

(5వ పేజీ తరువాయి)
నిర్వహణకు జిల్లాలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

- జిల్లాలో ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కోసం 72, పదవ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కోసం 97 పరీక్ష కేంద్రాలను సిద్ధం చేశామన్నారు. ప్రశ్నపత్రాల తరలింపులో పోలీస్ ఎస్కార్ట్ ఉండాలన్నారు. జిల్లాలో పదో తరగతి పరీక్షలకు 6 ఫ్లైయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశామని, ప్రతి కేంద్రం వద్ద సీనియర్ అసిస్టెంట్ క్యాడర్‌లో సిట్టింగ్ స్క్వాడ్ ఉంటుందని, వీరందరికీ స్పష్టమైన ఆర్డర్స్ అందించాలని ఆయన సూచించారు.
- ప్రతి పరీక్షా కేంద్రం వద్ద తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, ఫస్ట్ ఎయిడ్ చికిత్సకు మందులతో పారా మెడికల్ సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు.

పరీక్షా కేంద్రాల వద్ద నిరంతర విద్యుత్ సరఫరా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల పరిసరాలలో 144 సెక్షన్ అమలు చేయాలని, పరీక్షలు ముగిసిన తర్వాత పోస్టల్ శాఖ ద్వారా జవాబు పత్రాలు సరిగ్గా పంపేందుకు ఏర్పాట్లు పకడ్బందీగా క్లోస్డ్ కంటియినర్‌లలోనే జరగాలని అన్నారు.

ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవిబాబు, జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖరశర్మ, డీపీవో ఆశాలత, ట్రాన్స్కో ఎస్ఈ సురేందర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కళావతిబాయి, మిషన్ భగీరథ ఈఈ పుష్పలత, ఆర్టీసీ, విద్యుత్, మునిసిపల్, పోస్టల్, ట్రెజరీ, పోలీస్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి సెక్షన్ 163 అమలు

(5వ పేజీ తరువాయి)
చేయకూడదని తెలిపారు. ఎన్నికల ప్రచారం గడువు ముగిసిన తరువాత ఐదుగురికి మించకుండా మైకులు, స్పీకర్లు లేకుండా ఇంటింటికి ప్రచారం చేసుకునే వారికి ఈ ఆంక్షలు వర్తించవని పేర్కొన్నారు. అదేవిధంగా విధి నిర్వహణలో ఉన్న పోలీసు, ఫారెస్ట్, కేంద్ర బలగాలు, హోంగార్డులు, ఎస్‌పీవోలకు నిషేధ ఆంక్షల నుంచి మినహాయింపు ఉంటుందన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రతీ పోలింగ్ స్టేషన్ వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లను సిద్ధం చేశామన్నారు. ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ యాక్ట్ అమలు చేస్తున్నట్లు పోలీస్ కమిషనర్ తెలిపారు. కాగా మద్యం దుకాణాలను మంగళవారం సాయంత్రం నాలుగు గంటల నుంచి గురువారం సాయంత్రం నాలుగు గంటల వరకు మూసివేయనున్నట్టు తెలిపారు.

48 గంటలపాటు సైలెన్స్ పీరియడ్

ఈ నెల 27న నల్లగొండ, ఖమ్మం, వరంగల్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ జరగనున్న నేపథ్యంలో 48 గంటల పాటు సైలెన్స్ పీరియడ్ అమలులో ఉంటుందని కొత్తగూడెం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జితేష్ వి పాటిల్ సోమవారం తెలిపారు.

సైలెన్స్ పీరియడ్‌లో భాగంగా మంగళవారం సాయంత్రం 4 గంటల నుంచి 27వ తేదీ సాయంత్రం 4గంటల వరకు బహిరంగ సభలు, ఊరేగింపులు సమావేశాలు నిర్వహించడం,

ప్రచారం చేయడం ఎలాంటి అభ్యంతకరమైన, రాజకీయపరమైన అంశాలతో కూడిన సంక్షిప్త సందేహాలు, బల్క్ ఎస్ఎంఎస్ పంపడంపై ఎన్నికల సంఘం నిషేధం విధించడం జరిగిందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని బహిరంగసభలు, ఊరేగింపులు, సమావేశాలు నిర్వహించకూడదని, ప్రచారం చేయరాదని కలెక్టర్ సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే సందేశాలను నిశితంగా పర్యవేక్షించడం జరుగుతుందన్నారు.

తవ్వుకో... దండుకో...

(5వ పేజీ తరువాయి)



జరుగుతున్న ప్రాంతాలకు అధికారులు వెళ్లి హెచ్చరించి, మట్టి తవ్వుతున్నవారిపై పోలీసులకు ఫిర్యాదు కూడా ఇచ్చిన్నట్లు తెలిసింది. అయినా వారు ఖాతర్ చేయకుండా యథేచ్ఛగా మెయిన్‌కెనాల్ 15.8 కిలోమీటరు నుంచి 18.8కిలోమీటరు, 25వ కిలోమీటరు వద్ద రాత్రికిరాత్రి మట్టితోలకాలు చేస్తున్నారు. నాలుగు వేల క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యం ఉన్న ఈ కాల్వకట్టలకు ప్రమాదం జరిగితే భారీగా నష్టం జరిగే అవకాశం ఉంది. 21 ఎంబీసీ కాల్వ ఆయుకట్టులో సుమారు లక్షలాది ఎకరాలు సాగులో ఉంది. అంత ప్రధానకాల్వ కట్ట నుంచి మట్టి తవ్వకాలు జరుగుతుండడంతో భవిష్యత్‌లో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా నీటిపారుదల శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకొని అక్రమంగా తరలివెళ్లే మట్టిని అడ్డుకోవాలని రైతులు కోరుతున్నారు.

మట్టిని తరలిస్తే కఠిన చర్యలు
రాణి, ఏఈఈ, నీటిపారుదలశాఖ

ఎన్నెస్పీ కాల్వకట్టలపై రాత్రివేళల్లో తవ్వకాలు జరుపుతున్నారు. తవ్వకాలు జరిగే ప్రదేశం వద్దకు తాము వెళ్లినప్పుడు ఎవరు ఉంటారో వారిపై చర్యలు తీసుకుంటాం. కాల్వకట్టల నుంచి మట్టితవ్వకాలు జరిపితే భవిష్యత్తులో భారీ ప్రమాదాలు ఎదుర్కోవలసి ఉంటుంది. ఎన్నెస్పీ-21కి ఎంబీసీ పరిధిలో కాల్వకట్టలకు ఉన్న మట్టిని ఎవరైనా అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

పూసుకుంటలో అభివృద్ధి పనులపై మంత్రి ఆరా

- పలు సమస్యలను ప్రస్తావించిన పార్టీ నాయకులు
- పరిష్కారానికి మంత్రి తుమ్మల హామీ


గ్రామస్థులతో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

దమ్మపేట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పూసుకుంట గ్రామంలో కొండ రెడ్ల అభివృద్ధిపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆరా తీశారు. గండుగులపల్లిలో క్యాంపు కార్యాలయంలో సోమవారం మంత్రి తుమ్మలను అశ్వారావుపేట, దమ్మపేట, పెనుబల్లి, సత్తుపల్లి వేంసూరు తదితర మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పలువురు కలిశారు.

ఈ సందర్భంగా పూసుకుంటలో జరుగుతున్న అభివృద్ధి పనులపై పార్టీ నాయకుడు కొయ్యల అచ్యుతరావును అడిగి తెలుసుకున్నారు. కొండరెడ్ల అభివృద్ధి కోసం సాగుభూములకు మంజూరైన బోర్ల నిర్మాణం, మోటర్ల ఏర్పాటుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. యువతకు ఉపాధి కల్పించేందుకు ఆ గ్రామంలో ఇటీవలే కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఐటీడీఏఈ పీవో రాహుల్ ఇంటింటి సర్వే చేపట్టగా ఆ పనుల వివరాలను తెలుసుకున్నారు. కొండరెడ్ల అభివృద్ధిపై త్వరితగతిన చర్యలు తీసుకోవాలని తుమ్మల కోరారు.

సత్తుపల్లిలో సింగరేణి యాజమాన్యం స్థానిక లారీలకు బొగ్గు కిరాయిలు కల్పించటం లేదని సమస్యను పరిష్కరించాలని లారీ యజమానులు తుమ్మలకు వినతిపత్రం అందజేశారు. ఈ సమస్యపై స్పందిస్తూ ఎమ్మెల్సీ ఎన్నికల అనంతరం సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. వేంసూరు మండలంలో ఇటీవల సీతారామ ప్రాజెక్టు కెనాల్ నిర్మాణాలను చేపట్టేందుకు ప్రభుత్వం సర్వే చేయగా భూసేకరణ చేయటం వల్ల ఉపయోగం లేదని, ప్రత్యేక కెనాల్ అవసరం లేదని, ఎన్టీఆర్ కెనాల్ ద్వారా చెరువులను నింపితే సరిపోతుందని రైతులు తెలిపారు. సమస్యను మంత్రి తుమ్మల దృష్టికి తీసుకువెళ్లగా పరిశీలించి చర్యలు తీసుకుంటానన్నారు. వేంసూరు మండలంలో నిర్మించనున్న పామాయిల్ ఫ్యాక్టరీ రహదారి నిర్మాణంపై ఆరా తీశారు.

గండుగులపల్లి గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న తుమ్మల చెన్నారావు నివాసానికి వెళ్లి ఆయనను పరామర్శించి ఆరోగ్యంపై ఆరా తీశారు. ఆయన వెంట కొయ్యల అచ్యుతరావు, దొడ్డా ప్రసాద్, కేవీ సత్యనారాయణ, ఎర్రా వసంతరావు, కాసాని మంగేశ్వరరావు, చల్లగుళ్ల నర్సింహారావు, కొత్తూరి ప్రభాకరరావు, మన్నెం అప్పారావు, సాయిబాబు, దొడ్డా సత్యం, బచ్చు సత్యనారాయణ, వెల్ది జగన్మోహన్‌రావు, నున్నా రామకృష్ణ తదితరులున్నారు.



చుక్..చుక్.. రైలు వేయండి

- ప్యాసింజర్ రైలు వేస్తే తగ్గనున్న దూరాభారం..
- మోటమర్రి, విష్ణుపురం మధ్య ట్రాక్ పూర్తయి మూడేళ్లు
- ఇప్పటికే ఈ మార్గంలో రోజుకు 20 దాకా నడుస్తున్న గూడ్స్ రైళ్లు
- చైన్నై- ఢిల్లీ ప్రధాన రైలు మార్గంలో తగ్గనున్న ట్రాఫిక్
- విజయవాడ-సికింద్రాబాద్ మధ్య 60 కి.మీ మేర తగ్గనున్న దూరం



మధిరటౌన్, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): రైల్వే అధికారులు కాస్త చొరవ చూపి మోటమర్రి-విష్ణుపురం మార్గంలో ప్రయాణికుల కోసం రైలు నడిపితే విజయవాడ నుంచి సికింద్రాబాద్ వెళ్లే ప్రయాణికులకు ఈ మార్గంలో గంట సమయం కలిసి రావడమే కాకుండా దూరంతో పాటు భారం కూడా తగ్గుతుంది. బోనకల్ మండలంలోని మోటమర్రి రైల్వే స్టేషన్ నుంచి నల్లగొండ జిల్లా విష్ణుపురం రైల్వేస్టేషన్ మధ్య రైల్వే ట్రాక్ పూర్తయి మూడేళ్లు కావస్తోంది. ఈ మార్గంలో రోజుకు 20 దాకా గూడ్సు రైళ్లు నడుపుతున్న రైల్వే శాఖ ప్రయాణికుల కోసం మాత్రం ఒక్క రైలు కూడా నడిపేందుకు ముందుకు రావడం లేదు. ఈ ప్రాంత ప్రజలకు ఊళ్లో రైల్వేలైన్, రైల్వేస్టేషన్ ఉన్నా రైలు ఎక్కే అవకాశం లేకుండా పోయింది.



అమలు కాని డీఆర్ఎం మాట...

ఈ మార్గంలో రైల్వే ట్రాక్ పూర్తయితే ప్రయాణికుల రైలు కూడా నడిపేందుకు రైల్వే శాఖ ఆలోచిస్తుందని 2019 లో రైల్వే డీఆర్ఎం మధిర వచ్చినప్పుడు చెప్పిన మాట ట్రాక్ నిర్మాణం పూర్తయి మూడేళ్లయినా రైలుకు నోచుకోలేదు. మోటమర్రి-విష్ణుపురం మార్గంలో మక్కపేట, జగ్గయ్యపేట, రామాపురం, మేళ్లచెరువు, సంత్ సేవాలాల్ మహరాజ్ స్టేషన్‌లు ఏర్పాటు అయ్యాయి, విజయవాడ-సికింద్రాబాద్ మార్గంలో మోటమర్రి రైల్వేస్టేషన్ ఉండగా సికింద్రాబాద్, నడికుడి, గుంటూరు మార్గంలో విష్ణుపురం స్టేషన్ ఉంది. విజయవాడ నుంచి సికింద్రాబాద్‌కు ప్రస్తుత రైలు మార్గం 350 కి.మీలు దూరం ఉండగా అదే రైలు విజయవాడ నుంచి మోటమర్రి, విష్ణుపురం మీదగా సికింద్రాబాద్ చేరాలంటే 290 కి.మీ ప్రయాణిస్తే సరిపోతుంది. దీనితో ప్రయాణికులకు సుమారు 60కి.మీ దూరం తగ్గటమే కాకుండా సమయం ఆదాతో పాటు టిక్కెట్ భారం కూడా తగ్గే అవకాశం ఉంది.

ట్రాఫిక్ తగ్గే అవకాశం..

ఈ రైల్వే లైను ప్రయాణికులకు అందుబాటులోకి తెస్తే చైన్నై- ఢిల్లీ ప్రధాన రైలు మార్గం పై కూడా ట్రాఫిక్ తగ్గేఅవకాశం ఏర్పడుతుంది. తద్వారా కోల్‌కత్తా, చెన్నై నుంచి ఢిల్లీ, సికింద్రాబాద్ వెళ్లే రైళ్లకు కూడా ట్రాఫిక్ తగ్గి గమ్యం త్వరగా చేరుకునే అవకాశం ఉంది. మోటమర్రి-విష్ణుపురం మార్గంలో వందలాది సిమెంట్, దాని అనుబంధ పరిశ్రమలు ఉండటంతో పాటు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా దామరచర్ల వద్ద నిర్మిస్తున్న యాద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంటు ఈ మార్గంలోనే ఉంది. దీనితో రోజుకు 20కి పైగా గూడ్సు రైళ్లు సిమెంట్, బొగ్గు రవాణా కోసం ఈ మార్గంలో నడుస్తున్నాయి. వేల మంది కార్మికులు ఈ పరిశ్రమల్లో పని చేస్తున్నారు. ఇదే మార్గంలో ఎంతో ప్రసిద్ధి చెందిన పెనగంచిప్రోలు తిరుపతమ్మ తల్లి దేవాలయంతో పాటు గిరిజనుల ఆరాధ్య దైవం అయిన జాన్‌పహాడ్ సైదులు దర్గాతో పాటు మేళ్లచెరువులో అతి పురాతనమైన శివాలయం కూడా ఉంది.

పూర్తయిన విద్యుదీకరణ..

సింగిల్ లైన్‌గా ఉన్న మోటమర్రి-విష్ణుపురం మార్గం మొత్తం విద్యుదీకరణ కూడా పూర్తి కావడంతో గూడ్సు రైళ్లు అని విద్యుత్ ఇంజన్‌తోనే నడస్తున్నాయి. విజయవాడ నుంచి మోటమర్రి వరకు 60కి.మీ లు డబుల్ లైన్ ఉండగా మోటమర్రి నుంచి విష్ణుపురం వరకు 70కి.మీలు మాత్రమే సింగిల్ లైన్ ఉంది అటు విష్ణుపురం నుంచి సికింద్రాబాద్ వరకు 160 కి.మీలతో పాటు గుంటూరు వైపునకు కూడా విద్యుదీకరణ పూర్తయిన డబుల్ లైన్ ఉంది. గత ఆగస్టులో భారీ వర్షాలకు కొండపల్లి వద్ద రైల్వే ట్రాక్ అంతా నీటిలో మునిగిపోయి విజయవాడకు చేరుకోలేని పరిస్థితుల్లో చెన్నై వెళ్లే రైళ్లను ఈ మార్గం గుండానే నడిపారు. అటు ఆంధ్రా ఇటు తెలంగాణ ప్రజా ప్రతినిధులు రైల్వే శాఖపై ఒత్తిడి తెచ్చి ఈ మార్గంలో ప్రయాణికుల కోసం రైలు నడిపించ కలిగితే రెండు రాష్ట్రాల మధ్య రాకపోకలకు మరో రైలు మార్గం ఏర్పడటమే కాకుండా, ఈ ప్రాంతం అంతా పారిశ్రామిక ప్రాంతం కావడంతో రెండు రాష్ట్రాలలో మరిన్ని పరిశ్రమలు వచ్చి మరింత మందికి ఉపాధి లభిస్తుంది.

ప్రభుత్వ ఆస్పత్రి స్థలంలో బ్యానర్ల తొలిగింపు

- పాత ధర్నాచౌక్ స్థలానికి భద్రత
- అధికారుల సమాలోచనలు



భద్రత గురించి చర్చిస్తున్న వైద్యాధికారులు

ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి అనుసంధానంగా ఉన్న పాత ధర్నా చౌక్ స్థలాన్ని రక్షించుకోనున్నట్లు వైద్యాధికారులు డాక్టర్ రాజేశ్వరరావు, డాక్టర్ ఎల్ కిరణ్‌కుమార్, ఆర్ఎంవో డాక్టర్ రాంబాబు తెలిపారు. కోర్టు ఉత్తర్వుల పేరుతో ఓ కుటుంబం ఆదివారం ఆ స్థలంలో బ్యానర్లు కట్టారు. వాటిని ఆస్పత్రి అధికారులు సోమవారం తొలగించారు. అక్కడ పార్కింగ్ కోసం ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. అక్కడే ఉండి ఆ స్థలానికి భద్రత కల్పించేందుకు సమాలోచనలు చేశారు. తక్షణమే ప్రహరీని నిర్మించి దాన్ని ఆస్పత్రి అవసరాలకు వినియోగించనున్నట్లు తెలిపారు. వారి వెంట ఆస్పత్రి అధికారులు రవికిశోర్, నందగిరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తాం

- అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి
- వినతిపత్రం సమర్పించిన టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు



అదనపు కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న జర్నలిస్టులు

ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సమస్యలను జిల్లా కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ దృష్టికి తీసుకెళ్లి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేలా చూస్తానని అదనపు కలెక్టర్ పి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల అంశం ప్రాసెస్ లో ఉందని, దీనిపై ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిశాక కలెక్టర్ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్)రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ కు సోమవారం వినతి పత్రం సమర్పించారు. ఇళ్ల స్థలాల విషయంలో సర్కారు ప్రత్యేక చొరవ చూపాలని టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పల్లా కొండల్ రావు, కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి కోరారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో రీవ్యూ పిటిషన్ వేసి సమస్య సానుకూలంగా పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



వద్దుగూడెం స్వయంభూ శివాలయంలో మంత్రి తుమ్మల

శివాలయంలో మంత్రి తుమ్మల పూజలు

దమ్మపేట, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ముష్టిబండ గ్రామ సమీపంలోని స్వయంభూ శ్రీభువనసుందరిసమేత దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో వ్యవసాయశాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివరాత్రి సందర్భంగా శివాలయంలో పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. విఘ్నేశ్వరపూజ, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, అమ్మవారికి పంచామృత అభిషేకం నిర్వహించారు. మంత్రి తుమ్మలకు ఆలయ చైర్మన్ రావు గంగాధరరావు, కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు ప్రసాద్‌శర్మ ప్రత్యేక పూజలు చేసారు. తుమ్మల మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఆయన వెంట దొడ్డా ప్రసాదు, రావు గంగాదరరావు, సాయిబాబు, ఎర్రావసంతరావు, కాసాని మంగేశ్వరరావు తదితరులున్నారు.

మార్కెట్‌కు మూడు రోజులు సెలవులు

ఖమ్మంమార్కెట్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌కు ఈనెల 26 నుంచి 28 వరకు వరుసగా మూడు రోజులు సెలవులు ఉన్నట్లు మార్కెట్ సెక్రెటరీ ప్రవీణ్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 26, 27 తేదీలు శివరాత్రి పర్వదినం సందర్భంగా, 28 శుక్రవారం అమావాస్య సందర్భంగా సెలవులు ఉన్నట్లు ఆయన తెలిపారు. మార్కెట్‌లో తిరిగి మార్చి 1 శనివారం నుంచి యథావిధిగా క్రయవిక్రయాలు ఉంటాయని ఆయన తెలిపారు. రైతులు సెలవులు విషయాన్ని గ్రహించాలని కోరారు.

పట్టుదలతో చదివి జీవితంలో స్థిరపడాలి

- భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్



విద్యార్థిని తల్లిదండ్రులకు చెక్కు అందజేస్తున్న పీవో

భద్రాచలం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఐఐటీలో సీటు రాగానే అంతటితో చదువు ఆపకుండా పట్టుదలతో చదివి జీవితంలో స్థిరపడినప్పుడే చదివిన చదువుకి సార్థకత లభిస్తుందని ఐటీడీఏ పీవో బి.రాహుల్ అన్నారు. సోమవారం తన చాంబర్‌లో కూసుమంచి మండలం గోరీల పాడుతండాకు చెందిన తేజావత్ సింధు గురుకుల కళాశాల భద్రాచలంలో ఎంపీసీ చదివి ఐఐటీలో 236వ ర్యాంకు సాధించి తిరుపతిలో బీటెక్ చేయడానికి సీటు సంపాదించిందని అన్నారు. మొదటి సంవత్సరం ప్రోత్సాహకంగా రూ.50 వేల చెక్కును ఆమె తల్లిదండ్రులకు అందించారు. ఈ చెక్కు బాలిక తల్లిదండ్రులకు అందిస్తూ ఖాళీ సమయంలో కింది తరగతి విద్యార్థులకు మక్కువ కలిగేలా స్ఫూర్తి నింపాలని కోరారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్‌రాజు, బాలిక తల్లిదండ్రులు పాల్గొన్నారు.

150కేజీల గంజాయి పట్టివేత..?

కూసుమంచి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఖమ్మం-సూర్యాపేట జాతీయ రహదారిలో కూసుమంచి మండలం నాయకన్‌గూడెం టోల్‌ప్లాజా సమీపంలో సోమవారం తెల్లవారుజామున భారీఎత్తున గంజాయిని పట్టుకున్నట్లు తెలిసింది. మిర్యాలగూడేనికి చెందిన ఓవ్యక్తి చింతూరు నుంచి హైదరాబాద్‌కు ఒక వాహనంలో తరలిస్తుండగా, సమాచారంతో పోలీసులు దాడిచేసి పట్టుకున్నట్లు తెలిసింది. సుమారు 150కేజీలకు పైగా ఉండొచ్చని సమాచారం. గంజాయిని గుర్తుపట్టకుండా ప్యాకెట్లుగా తయారుచేసి తరలిస్తున్నారు. ఎక్కడి నుంచి ఎక్కడకు, ఎవరు తరలిస్తున్నారు..? అనేదానిపై పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం.

పాల్వంచలో ఐదు కేజీలు..

పాల్వంచ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్- ఒరిస్సా సరిహద్దు ప్రాంతం నుంచి అక్రమంగా హైదరాబాద్ తరలిస్తున్న ఐదు కేజీల ఎండు గం జాయిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం పాల్వంచలో పట్టుకున్నారు. నమ్మదగిన సమాచారం అందుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నవభారత్ ప్రాంతంలో వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో భద్రాచలం నుంచి కొత్తగూడెం వైపు వెళుతున్న ఓ ద్విచక్ర వాహనాన్ని అనుమానంతో ఆపారు. వాహనంపై ప్రయాణిస్తున్న ఇద్దరు యువకులు మర్రి సాయితేజ, కట్ల వివేకొరెడ్డిలను తనిఖీ చేయగా వారి వద్ద ఉన్న బ్యాగుల్లో ఐదు కేజీల ఎండు గంజాయి లభించింది. దీంతో వారిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.2 లక్షల విలువ చేస్తుందని, నిందితులను కోర్టులో హాజరుపరచనున్నామని ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సుంకరి రమేష్ తెలిపారు. ఈ తనిఖీల్లో హెచ్‌సీ కరీం, కానిస్టేబుల్స్ సుధీర్, వెంకటేష్, విజయ్, హనుమంతరావు, ఉపేందర్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నేలకొండపల్లి, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాల ప్రకారం.. నేలకొండపల్లికి చెందిన షేక్.మదార్(42) సూర్యాపేట జిల్లా కోదాడలో సెంట్రింగ్ పనులు చేస్తుంటాడు. ఆదివారం మధ్యాహ్నం కోదాడ నుంచి ద్విచక్ర వాహనంపై నేలకొండపల్లి వస్తూ పోలీస్‌స్టేషన్ సమీపంలో డివైడర్‌ను బలంగా ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన మదార్‌కు నేలకొండపల్లి సీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్స జరిపి, మెరుగైన చికిత్స కోసం ఖమ్మం తరలించారు. ఖమ్మంలో చికిత్స పొందుతూ అతడు సోమవారం సాయంత్రం మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

కృత్రిమ మేధ తరగతులను

సద్వినియోగం చేసుకోండి: డీఈవో

నేలకొండపల్లి, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): కృత్రిమ మేధ(ఏఐ) తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని డీఈవో సోమశేఖరశర్మ కోరారు. కృత్రిమ మేధ పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన నేలకొండపల్లిలోని సింగారెడ్డి ప్రాథమిక పాఠశాలలో కృత్రిమ మేధ తరగతులను ప్రారంభిం చి మాట్లాడారు. అందులో భాగంగానే ప్రభుత్వం కృత్రిమ మేధను తీసుకొచ్చింది. కృత్రిమ మేధ పతకం కింద నేలకొండపల్లిలోని సింగారెడ్డిపాలెం ప్రాథమిక పాఠశాలను ఎంపిక చేసిందన్నారు. కార్యక్రమంలో అకడమిక్ మానిటరింగ్ అధికారి రవికుమార్, స్కూల్ ప్రధానోపాధ్యాయుడు హరి శ్రీనివాస్, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం రమేష్, అమ్మా ఆదర్శ పాఠశాల చైర్మన్ నాగమణి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చివరి భూములకు నీరందించాలని నిరసన



వైరా మేజర్ తూము వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

కొణిజర్ల, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): బోనకల్ బ్రాంచ్ కెనాల్‌కు నీరు పుష్కలంగా వదిలితే సరిపోతుందా, అక్కడ నుంచి మేజర్‌లకు నీరివ్వకుండా బీబీసీ చివరకు పంపుతారా మధ్యలో ఉన్న భూములు ఏమికావాలంటూ బీబీసీ కాల్వ పరిధి వైరా మేజర్ కాల్వ ఆయకట్టు పల్లిపాడు రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం బీబీసీ వైరా మేజర్ తూము వద్దకు చేరుకొని ఆందోళన చేశారు. చివరి భూములకు నీరందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న నీటిపారుదలశాఖ అధికారులు సీఈ రమేష్, ఈఈ బాబురావు, డీఈ శిల్పాగౌతమి, ఏఈ నాగేశ్వరావు రైతులు వద్దకు వచ్చారు. ఆందోళన పడొద్దని సాయంత్రం వరకు నీరు వైరా మేజర్‌కు విడుదల చేస్తామని, బీబీసీ కింద భూములు ఎండిపోతుండటంతో అటు పంపిస్తున్నామని వారు రైతులకు తెలిపారు. సాయంత్రం వరకు నీటిని వదులుతామని తెలపటంతో రైతులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం మాజీ అధ్యక్షుడు రాంపుడి సురేష్, రైతులు వెంకయ్య, రాధాకృష్ణ, పుల్లారావు, బాలకృష్ణ, దేవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

20 క్వింటాళ్ల రేషన్‌బియ్యం పట్టివేత

కరకగూడెం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోమవారం కరకగూడెం ఎస్ఐ రాజేందర్ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేపడుతుండగా అక్రమంగా ఓ వాహనంలో తరలిస్తున్న 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న కరకగూడెం గ్రామానికి చెందిన మహమ్మద్ ఇమ్రాన్, పద్మాపురం గ్రామానికి మహమ్మద్ నోమన్ అనే ఇద్దరిని, వాహనాన్ని అదుపులోకి తీసుకున్నారు. వాహనాన్ని సీజ్ చేసి, ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజేందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రైటర్ దుర్గారావు, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో ఆరు నెలల జైలు

భద్రాచలం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): హత్యాయత్నం కేసులో దుమ్ముగూడెం మండలం రేగుబల్లి గ్రామానికి చెందిన జెట్టి చరణ్ అనే నిందితుడికి ఆరు నెలల జైలుశిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ భద్రాచలం ప్రథమశ్రేణి న్యాయాధికారి శివనాయక్ సోమవారం తీర్పు వెల్లడించారు. బుయ్యని వినోదు అనే వ్యక్తిపై ఏడాది క్రితం చరణ్ భౌతిక దాడి చేయగా, బాధితుడి ఫిర్యాదు మేరకు భద్రాచలం పోలీసులు కేసు నమోదు చేసి చార్జిషీటు దాఖలు చేశారు. నిందితుడు చరణ్‌పై నేరం రుజువు కావడంతో శిక్ష ఖరారు చేస్తూ న్యాయాధికారి తీర్పు వెల్లడించారు. ఈ కేసును ఎస్ఐ మధుప్రసాద్ నమోదు చేయగా, ఏపీపీ శ్రీనివాస్ ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

గెలుపుకోసం తహతహ

- సర్వశక్తులు ధారపోస్తున్న అభ్యర్థులు
- సిట్టింగ్ స్థానం దక్కించుకునేందుకు యూటీఎఫ్ వ్యూహాలు

ఇల్లెందు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ శాసనమండలి నల్గొండ, ఖమ్మం, వరంగల్ ఉమ్మడి జిల్లాల నియోజకవర్గంలో సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకునేందుకు టీఎస్ యూటీఎఫ్ సర్వశక్తులు ఒడ్డుతుంది. టీఎస్ యూటీఎఫ్ అభ్యర్థిగా రెండోవ పర్యాయం పోటీలో ఉన్న సిట్టింగ్ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, తాజా ఎన్నికల్లో పీఆర్టీయూ- టీఎస్ అభ్యర్థి పింగళి శ్రీపాల్‌రెడ్డి, జాక్టో సంఘాలు, బీసీ సంఘాలు బలపరుస్తున్న మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, బీజేపీ అభ్యర్థిగా పోటీలో ఉన్న సరోత్తంరెడ్డి, పీఆర్టీయూ తెలంగాణ అభ్యర్థిగా బరిలో ఉన్న హర్షవర్ధన్‌రెడ్డిల నుంచి గట్టి పోటీ ఎదుర్కొంటున్నారు.

సిట్టింగ్ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి విజయం కోసం యూటీఎఫ్‌తో పాటు టీపీటీఎఫ్ సంఘాల నాయకులు తీవ్ర స్థాయిలో కృషి చేస్తున్నారు. నల్గొండ, ఖమ్మం, వరంగల్ ఉమ్మడి జిల్లాల పరిధి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో 19మంది అభ్యర్థులు పోటీలో ఉన్నప్పటికీ ప్రధాన పోటీదారులు ప్రచారంలో దూసుకెళ్తున్నారు. ఎన్నికల ప్రచారానికి మంగళవారంతో గడవు ముగుస్తుండటంతో అభ్యర్థులు, సంఘాల ప్రచారం తారాస్థాయికి చేరింది. ఈ నెల27న పోలింగ్ జరుగనుండటంతో వ్యూహప్రతివ్యూహాలతో పోల్ మేనేజ్‌మెంట్‌కు ప్రధాన పోటీదారులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.



ఖమ్మం జిల్లా నుంచి ఒకేఒక్కరు..

నల్గొండ, ఖమ్మం, వరంగల్ ఉమ్మడి జిల్లాల పరిధి ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఇప్పటి వరకు ఖమ్మం జిల్లా నుంచి ఒకే ఒక్కరు ప్రాతినిధ్యం వహించడం గమనార్హం. రద్దు అయిన శాసన మండలిలో ఖమ్మం జిల్లాకు చెందిన సామినేని హిమవంతరావు పీఆర్టీయూ ద్వారా ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. నల్గొండ, ఖమ్మం, వరంగల్ ఉమ్మడి జిల్లాల శాసనమండలి ఉపాధ్యాయ నియోజకవర్గంలో పీఆర్టీయూ మూడు పర్యాయాలు, యూటీఎఫ్ రెండు పర్యాయాలు, ఎస్టీయూ రెండు పర్యాయాలు విజయం సాధించాయి. శాసన మండలి గతంలో రద్దు కాకముందు ఆరు జిల్లాల పరిధిలో ఉపాధ్యాయ నియోజకవర్గం ఉండేది. తదిపరి శాసన మండలిని 2007లో పునరుద్దరించిన పిదప నల్గొండ, ఖమ్మం, వరంగల్ ఉమ్మడి జిల్లాల పరిధి ఉండగా తాజాగా జరుగుతున్న 2025 శాసన మండలి ఎన్నికల్లో 12 జిల్లాల ప్రాతినిధ్యంతో ఉపాధ్యాయ నియోజకవర్గం ఎన్నికలు జరుగుతుండటం గమనార్హం. ఇప్పటి వరకు నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ నియోజకవర్గంలో ఎమ్మెల్సీలుగా ముత్తిరెడ్డి(ఎస్టీయూ), రాంబ్రహ్మం(ఎస్టీయూ), సామినేని హిమవంతరావు(పీఆర్టీయూ), ధర్మారెడ్డి(పీఆర్టీయూ), చుక్కా రామయ్య(యూటీఎఫ్), పూలరవీందర్(పీఆర్టీ యూ), అలుగుబెల్లి నర్సిరెడ్డి(యూటీఎఫ్) ఎన్నికయ్యారు.

2019లో యూటీఎఫ్ విజయం...

నల్లగొండ, ఖమ్మం, వరంగల్ శాసన మండలి ఉపాధ్యాయ నియోజకవర్గంలో 2019లో హోరాహోరీగా జరిగిన ఎన్నికల్లో అప్పటి సిట్టింగ్ ఎమ్మెల్సీ పీఆర్టీయూ పీఆర్‌టీయూ అభ్యర్థిగా పోటీచేసిన పూల రవీందర్‌పై యూటీఎఫ్ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి 2,729 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఆ ఎన్నికల్లో అలుగుబెల్లి నర్సిరెడ్డికి టీపీటీఎఫ్ మద్దతునిచ్చింది. తాజాగా జరుగనున్న 2025 ఎమ్మెల్సీ ఎన్నికల్లో సైతం యూటీఎఫ్ అభ్యర్థిగా పోటీలో ఉన్న నర్సిరెడ్డికి టీపీటీఎఫ్ మద్దతునిస్తోంది. కాగా 2019 ఎన్నికల్లో పీఆర్టీయూ అభ్యర్థిగా పోటీ చేసిన పూల రవీందర్ తాజా ఎన్నికల్లో జాక్టో, బీసీ సంఘాల మద్దతుతో పోటీలో ఉండటం గమనార్హం.

శివరాత్రి వేడుకలకు

కనకగిరి ముస్తాబు...

చంద్రుగొండ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : చంద్రుగొండ మండల పరిధిలోని బెండాలపాడు శివారు కనకగిరి (కనకాద్రి) గుట్టలపైన ఉన్న వీరభద్రస్వామి ఆలయంలో శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. కాకతీయ రాజులు నిర్మించినట్లు ప్రచారంలో ఉన్న ఈ ఆలయంలో దశాబ్ధాలుగా శివరాత్రి ఉత్సవాలు జరుతున్నా చుట్టు ప్రక్కల గ్రామాల వారికే తప్ప పెద్దగా బయట ప్రాంతాల వారికి తెలియదు. కాగా గత దశాబ్ధకాలంగా చంద్రుగొండకు చెందిన ప్రముఖ సిద్ధాంతి విపర్ల వెంకటకృష్ణమూర్తి, గుడి పునర్నిర్మాణం చేసిన దామరచర్ల జమిందారు సోమరాజు వెంకటేశ్వరావు కుటుంబ సభ్యుల ప్రత్యేక శ్రద్ధతో శివరాత్రి వేడుకలు నిర్వహిస్తూ కనకాద్రి గుట్టలు, వీరభద్రస్వామి ప్రాముఖ్యతను భక్తులకు వివరిస్తుండటంతో ప్రాచుర్యం పొందుతుంది. ఉమ్మడి ఖమ్మం జిల్లా నలుమూలల నుంచి గత కొన్ని సంవత్సరాలుగా వేలాది మంది భక్తులు ఆరుకిలో మీటర్ల ఎత్తులో ఉన్న గుట్టలపైకి కాలినడకన ఎక్కి శివపార్వతుల కల్యాణ ఉత్సావాలు తిలకిస్తుండటం విశేషంగా చెప్పవచ్చు. దీంతో పాటు కనకగి ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని ఇటివల అటవీ శాఖ ప్రకటించింది. భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్ పలుమార్లు గుట్టలను సందర్శించి పర్యాటకులను సైతం రపించి ఈ ప్రాంతాన్ని పరిచయం చేయడంతో మరింత ప్రాచుర్యంలోకి వచ్చింది.



గుట్టపై ఉన్న కోనేరు

దటమైన అడవులలో నెలకొన్న ఈ ఆలయం అభివృద్ధి చేసేందుకు ఎకో ఫ్రెండ్లీ టెక్నాలజీని వినియోగించి నిర్మాణాలు చేయాలని అందుకు ప్రభుత్వం సహకారం, ఉన్నతాధికారుల కృషి చేయాలని స్థానికులు కోరుతున్నారు.



హస్తాల వీరన్న విగ్రహం

గుట్టలపై వదంల ఎకరాల్లో కాకతీయులు నిర్మించిన గుళ్లు, కట్టడాలు, గుట్టపై ఎప్పుడు నీటితో ఉండే కోనేరు చూడలన్న అక్కడి ప్రకృతి అందాలను ఆస్వాదించాలన్న రాళ్లురప్పలు, అటవీ జంతువులు దాటి నిలువెత్తుగా ఉన్న 6 కిలో మీటర్ల గుట్టలపై కాలినడకన ఎక్కాల్సి ఉంటుంది. పర్యావరణానికి నష్టం జరగుండా వాహనాలు నడిచేందుకు మట్టితో రహదారి, గుట్టలపై కలపతో నిర్మాణాలు, సోలార్ విద్యుత్ తదితర మౌలిక వసతులు కల్పిస్తే కనకగిరి అద్భుతమైన టూరిజం ప్రాంతంగా అభివృద్ధి చెందిందని ఈ ప్రాంతవాసులు అభిప్రాయ పడుతున్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా నర్సిరెడ్డిని గెలిపించండి

» ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక పిలుపు

నేలకొండపల్లి, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): ఈనెల 27న జరుగనున్న ఖమ్మం, నల్లగొండ, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాలు బలపర్చిన ఉమ్మడి అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డికి మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని, తద్వారా ఉపాధ్యాయుల ఆత్మ గౌరవాన్ని నిలబెట్టాలని ఐక్యవేదిక నాయకులు మందడపు శ్రీనివాసరావు, తొర్తి గురవయ్య, రావెళ్ల అరవిందకుమార్, తేజావత్ గోవిందరావు ఉపాధ్యాయులను సోమవారం విడుదల చేసిన ప్రకటనలో కోరారు. గత ఆరేళ్లుగా ఉపాధ్యాయ ప్రతినిధిగా నర్సిరెడ్డి పని చేసారని పేర్కొన్నారు.



రవాణా శాఖకు ఆడిట్ మొట్టికాయలు

» విశ్రాంత ఉద్యోగులతో కుస్తీ


ఆదివారం ఫైళ్లు పరిశీలిస్తున్న విశ్రాంత ఉద్యోగి

ఖమ్మం సంక్షేమ విభాగం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): జిల్లా రవాణాశాఖకు మొట్టికాయలు తప్పటం లేదు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తుండటంతో ఆడిట్ జనరల్ అభ్యంతరాలు వ్యక్తం చేసిం ది. జిల్లా రవాణాశాఖలో 2013 నుంచి ఆడిట్ జనరల్ అభ్యంతరాలు వ్యక్తం కావటంతో అధికారులు దిద్దుబాటు చర్యలను చేపట్టారు. జిల్లా రవాణాశాఖలో పనిచేసి పదవీ విరమణ పొందిన అనుభవం కలిగిన ఉద్యోగిని, మరో ప్రైవేట్ వ్యక్తిని ఆదివారం సెలవు రోజు కార్యాలయానికి పిలిపించారు. కార్యాలయం ఏవోతో పాటుగా మరో ఇద్దరు ఉద్యోగులు దగ్గరుండి ఆడిట్ అభ్యంతరాల ఫైల్స్‌కు ఎలా సమాధానాలు ఇవ్వాలో సరి చేసుకున్నారు. నిబంధనల మేరకు వాహనాలకు అనుమతులు జారీ చేస్తే ఇటువంటి ఆడిట్ అభ్యంతరాలు ఏర్పడేవి కాదని రవాణాశాఖలో చర్చ జరుగుతోంది.


పారిశుధ్య పనులు చేస్తున్న దృశ్యం

ఒక్కొక్కరిగా కాదు..
ఒకేసారి 100 మంది..

» ఒకే బృందంగా 120 మంది పారిశుధ్య కార్మికులు
» ఉదయం గ్యాంగ్ వర్క్ సాయంత్రం డివిజన్‌లో పారిశుధ్య నిర్వహణ
» ఎంత పెద్ద పనయినా ఇట్టే సంపూర్ణంగా పూర్తి
» అద్దంలా మారుతున్న నగరం
» సత్ఫలితాన్నిస్తున్న కమిషనర్ అభిషేక్ ఆలోచన

ఖమ్మం సంక్షేమ విభాగం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఒక్కొక్కరి కంటే పది మంది కలిసి పనిచేస్తే కొండనైనా పిండి చేయవచ్చని నిరూపిస్తున్నారు ఖమ్మం నగర పాలకసంస్థ పారిశుధ్య కార్మికులు. కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య చేసిన ఆలోచన ఖమ్మంలో సత్ఫలితాన్నిస్తోంది. 120 మంది పారిశుధ్య కార్మికులతో బృందాన్ని ఏర్పాటు చేసి పెద్ద పెద్ద పారిశుధ్య పనులను గంటల్లో పూర్తి చేస్తున్నారు. ఉదయం గ్యాంగ్ పనులు చేస్తూ సాయంత్రం డివిజన్లలో పనులు చేస్తూ పారిశుధ్య కార్మికులు ప్రజల మన్ననలు పొందుతున్నారు. పారిశుధ్య కార్మికుల విధులను దుర్వినియోగం చేసే వారికి పరోక్షంగా తనదైన మార్కు చూపించారు కమిషనర్ అభిషేక్ అగస్త్య.

ఖిల్లా నుంచి సైడ్ కాల్వ వరకు క్లీన్

ఖమ్మం నగర పాలక సంస్థలో 700 మంది పారిశుధ్య కార్మికులతో 60 డివిజన్లలో పారిశుధ్య పనులు నిత్యం జరుగుతుంటాయి. ప్రతీ డివిజన్‌లో 8నుంచి 10 మంది పారిశుధ్య కార్మికులను కేటాయించారు. వారు ఆయా డివిజన్‌లకు మాత్రమే పరిమితంతో పనిచేశారు. కార్మికుల సంఖ్య తక్కువగా ఉండటంతో కేవలం వీధులు, డ్రెయినేజీలను శుభ్రం చేయడానికే పరిమితమయ్యారు. పారిశుధ్య కార్మికుల సంఖ్య మేరకు ఖమ్మం నగరంలో పారిశుధ్య పనులు జరగటం లేదు. దీంతో కమిషనర్ అభిషేక్ అగస్త్య ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు. ప్రతీ శానిటరీ ఇన్స్‌పెక్టర్ పరిధి నుంచి 20 మంది పురుషులు, మహిళలను తీసుకున్నారు.

ప్రత్యేక గ్యాంగ్ బృందాలు..

ఆరుగురు శానిటరి ఇన్స్పెక్టర్ల పరిధిలోని 120 మంది కార్మికులతో గ్యాంగ్ బృందాలను ఏర్పాటు చేశారు. జనవరి 24న ఎన్టీఆర్ సర్కిల్ నుంచి శ్రీశ్రీ విగ్రహం వరకు రహదారులు, మురుగుకాల్వలు, డివైడర్లు శుభ్రం చేసే పని చేపట్టారు. ఇది మంచి ఫలితాలను ఇచ్చింది. బైపాస్ రోడ్డు వెంట ఉన్న వ్యర్థాలు తొలగిపోయి రహదారులు పరిశుభ్రంగా మారాయి. తర్వాత గ్యాంగ్ వర్క్‌ను నిర్విరామంగా కొనసాగించారు.

శుభ్రమవుతున్న నగరం...

ఎఫ్‌సీఐ గోదాం రహదారి, రావర్తినగర్ ప్రధాన రహదారి, 49వ డివిజన్ రామాలయం, 36వ డివిజన్ చేపల మార్కెట్, 4వ డివిజన్, ధంసలాపురం శివాలయం, 20వ, 26వ డివిజన్‌లో గ్యాంగ్ పనులు పూర్తి చేశారు. గత పది రోజులుగా 40 మంది పారిశుధ్య కార్మికులతో ఖిల్లాను పరిశుభ్రం చేస్తున్నారు. దీంతో పారిశుధ్య పనుల వేగం పెరిగింది. ఉదయం గ్యాంగ్ వర్క్ పనులు చేసి సాయంత్రం సమయంలో డివిజన్లలో పారిశుధ్య పనులు చేస్తూ స్థానిక ప్రజలతో శభాష్ అనిపించుకున్నారు. ఖమ్మం నగరంలోని ఎంతటి పారిశుధ్యపనినైనా ఇట్టే పూర్త చేస్తున్నారు ఖమ్మం పారిశుధ్య కార్మికులు.


మాట్లాడుతున్న నున్నా నాగేశ్వరరావు

కేరళ హెల్త్ పాలసీని అమలు పరచాలి

సీపీఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా

ఖమ్మం ఖానాపురంహవేలి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో కేరళ హెల్త్ పాలసీ అమలు పరచాలని, పాలసీ తీసుకురావటం ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలకు ఉపయోగపడేలా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నం చేయాలని సీపీఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. సోమవారం సుందరయ్య భవన్‌లో పార్టీ టూటౌన్ కమిటీ ఆధ్వర్యంలో గత ఎనిమిది సంవత్సరాలుగా నడుస్తున్న నెలనెల వెన్నెల ఉచిత మెడికల్ క్యాంపును తిరిగి మార్చి ఒకటి నుంచి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మెడికల్ క్యాంప్ వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న వైద్య పోస్టులు భర్తీ చేసి ప్రభుత్వ వైద్యరంగాన్ని బలోపేతం చేయలన్నారు. ఈ కార్యక్రమంలో విక్రమ్, శ్రీనివాసరావు, ఝాన్సీ, అరుణ, రమేష్ తదతరులు పాల్గొన్నారు.

ముగ్గురు జవాన్లకు రెండు రోజుల వేతనం కట్

» పారిశుధ్య నిర్వహణ లోపంపై కమిషనర్ చర్యలు

ఖమ్మం సంక్షేమ విభాగం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని 32, 33, 36 డివిజన్ల జవాన్లు ఎ. శివ, జి. మోహన్‌రావు, జి. శ్రీనుకు సంబంధించిన రెండు రోజుల చొప్పున వేతనాలను కోత విధించాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య పారిశుధ్య పర్యవేక్షకుడు సాంబయ్యను ఆదేశించారు. సోమవారం 22, 27, 32, 33, 36 డివిజన్‌లలో కమిషనర్ ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా 32, 33, 36 డివిజన్లలో అపరిశుభ్రతపై కమిషనర్ సీరియస్‌గా స్పందించారు. వేతనాలు కట్ చేయాలని ఆదేశించారు.

కోల్డ్ స్టోరేజ్ యజమానికి జరిమానా

ఖమ్మం సంక్షేమ విభాగం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): కోల్డ్ స్టోరేజ్‌లోని వ్యర్థాలను ఖాళీ ప్రదేశంలో పోస్తున్న కారణంగా కోల్డ్ స్టోరేజ్ నిర్వాహకులకు కేఎంసీ పారిశుధ్య అధికారులు జరిమానా విధించారు. 28వ డివిజన్‌లోని గాయత్రి కోల్డ్ స్టోరేజ్ వ్యర్థాలను పక్కనే ఉన్న ఖాళీ ప్రదేశంలో డంపింగ్ చేస్తుండటంతో స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో పారిశుధ్య పర్యవేక్షకుడు సాంబయ్య పరిశీలించి కోల్డ్ స్టోరేజ్ నిర్వాహకులు డి. నరేశ్‌రెడ్డి, మదన్‌గోపాల్‌కు రూ.10వేలు జరిమాన విధించారు.

ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

» అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి


అర్జీలను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో వచ్చిన అర్జీలను తక్షణమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన జిల్లా రెవెన్యూ అధికారి ఏ. పద్మశ్రీ, డీఆర్డీవో సన్యాసయ్యతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన అర్జీలను పరిశీలన చేసి పెండింగ్ లేకుండా వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కలెక్టరేట్‌లో కార్యాలయాలు ఏర్పాటు చేసిన వివిధ శాఖలు వారి పరిధిలో ఉన్న ప్రభుత్వ భవనాల వివరాల నివేదికను మంగళవారం సాయంత్రంలోగా అందజేయాలని ఆయన కోరారు. ప్రజావాణి కార్యక్రమంలో అధికారులు, కలెక్టరేట్ ఏవో అరుణ తదితరులు పాల్గొన్నారు.

అందిన ఫిర్యాదుల్లో కొన్ని ఇలా ..

● తల్లాడ మండలం మల్లారం గ్రామానికి చెందిన షేక్ అసీఫ్, తన కుమారుడు షేక్ సూరజ్ ను ఓ ప్రైవేటు జూనియర్ కళాశాల లో చేర్పించి అనారోగ్య కారణంగా ఒక రోజులోనే ఇంటికి తిరిగి తీసుకొని వచ్చామని, కళాశాల యాజమాన్యం ఒక్క రోజుకు 15,500 ఫీజు వసూలు చేశారని, తనకు తన డబ్బులు ఇప్పించాలని కోరుతూ అదనపు కలెక్టర్‌న వేడుకున్నారు.

● మధిరకి చెందిన కాటారపు జయరాజు తన కుమార్తె ఇంటర్ చదువుతుందని జనన ధ్రువీకరణ పత్రం కోసం రెండు నెలల నుంచి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నానని బర్త్ సర్టిఫికెట్ ఇప్పించాలని కోరాడు.

● పెనుబల్లి మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన కొర్సా ప్రభాకర్ తాము 1985 నుంచి పోడు భూములు సాగు చేసుకుంటున్నామని, 2022 లో తమకు మూడు ఎకరాల తొమ్మిది గుంటల భూమి ఆర్వోఎఫ్ఆర్ సర్వే వచ్చిందని, పట్టాదారు పాసు పుస్తకం మాత్రం ఒక ఎకరం 6 గుంటలకు మాత్రమే వచ్చిందని, మిగిలిన రెండు ఎకరాల మూడు గంటల భూమికి ఆర్వోఎఫ్ఆర్ పట్టా పాస్ బుక్ మంజూరు చేయాలని కోరారు.

గోదాం నుంచి బియ్యాన్ని సకాలంలో అందించాలి

» అదనపు కలెక్టర్‌కు డీలర్ల వినతి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రేషన్ డీలర్లకు ప్రభుత్వ గోదాముల నుంచి బియ్యం ఆలస్యం కాకుండా సత్వరమే పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని డీలర్ల సంఘం నాయకులు బానోతు వెంకన్న, షేక్ జానిమియా సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఆయనను కలిసిన డీలర్ల సంఘం నాయకులు గత రెండు నెలలుగా జిల్లాలో డీలర్లకు సకాలంలో బియ్యం పంపిణీ కాకపోవడంతో లబ్ధిదారులు వాగ్వాదానికి దిగుతున్నారని చెప్పారు. బియ్యం పంపిణీని పెంచాలన్నారు. పోర్టబులిటీ ద్వారా బియ్యాన్ని పంపిణీ చేసిన డీలర్లకు తిరిగి కోటాను కేటాయించాలని వీటిలో కూడా జాప్యం జరుగుతుండడంతో డీలర్లు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారంటూ అదనపు కలెక్టర్‌కు వారు వివరించారు. వారి వెంట దొండ దుర్గయ్య తదితరులున్నారు.

ఉద్యోగులకు భద్రత కల్పించాలి

ఖమ్మం డివిజన్ ద్వై వార్షిక సమావేశంలో ఎఫ్ఎన్‌పీవో సెక్రటరీ వాసిరెడ్డి శివాజీ



మాట్లాడుతున్న ఎఫ్ఎన్‌పీవో జనరల్ సెక్రటరీ శివాజీ

ఖమ్మం మామిళ్లగూడెం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): తపాలశాఖలో వస్తున్న మార్పులను యూనియన్లతో చర్చించి అభిప్రాయ సేకరణ మేరకు ఉద్యోగులకు భద్రతను కల్పించేలా కృషిచేయాలని ఎఫ్ఎన్‌పీవో న్యూఢిల్లీ సెక్రటరీ జనరల్, గ్రూప్‌సీ ఆలిండియా జనరల్ సెక్రటరీ వాసిరెడ్డి శివాజీ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఖమ్మంలో ఎన్‌యూపీఈ గ్రూప్‌సీ, ఎంటీఎస్, ఎన్‌యూజీడీఎస్ ఖమ్మం డివిజన్ ద్వైవార్షిక సమావేశాన్ని నిర్వహించారు. ఈసమావేశంలో ఆయన ముఖ్యతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వం యూనియన్లతో సంప్రదింపులు చేయకుండానే మార్పులను చేర్పులను చేస్తుందని దీని వలన ఉద్యోగులకు భద్రత కరువవుతోందన్నారు. ఉద్యోగుల సంక్షేమం కోసం కేంద్ర జేఏసీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. తపాలాశాఖ మనుగడ కోసం ఉద్యోగుల సంక్షేమం కోసం చేసే ఆందోళనలో పెద్ద సంఖ్యలో ఉద్యోగులు పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ సికింద్రాబాద్ డివిజన్ బి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సీహెచ్‌ఎస్‌వీవీ కుమార్, కార్యదర్శిగా బి. హుస్సేన్, ట్రెజరర్‌గా పమ్మి వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. ఎంటీఎస్ యూనియన్‌కు అధ్యక్షుడిగా ఎన్ఎల్ నర్సింహారావు, జాటోత్ కిరణ్, కె. నాగమ్మ, ఎన్‌వీ జీడీఎస్ యూనియన్ నుంచి కె గోవిందరావు, ఎం రాంప్రసాద్, శ్రీనివాస్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని పలువురు అభినందించారు.

సమస్యల సత్వర పరిష్కారం

» ప్రజావాణిలో వినతులు స్వీకరించిన కమిషనర్ అభిషేక్ అగస్త్య


ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మం సంక్షేమ విభాగం, ఫిబ్రవరి 24: ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, ప్రజావాణికి వచ్చే వినతులను ఒక్క రోజే పరిష్కారం చూపాలని ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశించారు. సోమవారం కేఎంసీలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కంప్యూటర్ ఆపరేటర్ల వద్దకు వెళ్లి క్రమం తప్పకుండా ప్రజల నుంచి ఎటువంటి వినతులు అందుతున్నాయని తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల కోరకు వచ్చే దరఖాస్తుదారులకు అర్హత ఉంటే ఏ రోజు సమస్యలను ఆదే రోజు పరిష్కారం చూపాలన్నారు. ముస్తాఫానగర్‌కు చెందిన ఓ ఇంటియజమాని ఒకే నివాసానికి రెండు ట్యాక్స్‌లు వస్తున్నాయని ఫిర్యాదు చేశారు. 19వ డివిజన్‌లో తాగు నీటి పంపు కనెక్షన్ కోసం దరఖాస్తులు చేశారు. 2వ డివిజన్‌లో విద్యుత్ స్తంభాలు కావాలని ప్రజలు వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను కమిషనర్ అక్కడికక్కడే పరిష్కారం చూపారు. ప్రభుత్వ స్థలాలను కాపాడాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు యర్రా శ్రీకాంత్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు. డివిజన్ కార్యదర్శి వై. విక్రమ్, నాయకులు పాల్గొన్నారు. కార్మికులకు రవాణా సౌకర్యం లేకుండానే నగరంలోని అన్ని ప్రాంతాలకు తిప్పి గ్యాంగ్ పనులు చేయిస్తున్నారని ఆ పనులను నిలుపుదల చేయాలని సీఐటీయూ, టీయూసీఐ నాయకులు తుమ్మా విష్ణు, జీ రామయ్య కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. పట్టణ ప్రణాళిక అధికారి వసుందర, ఏవో శివలింగం, ఆర్వో శ్రీనివాస్, టీఎంసీ సుజాత, పారిశుధ్య పర్యవేక్షకులు సాంబయ్య పాల్గొన్నారు.

రైతులను నట్టేట ముంచిన ప్రభుత్వం

» బీఆర్ఎస్ నాయకులు అచ్చయ్య, క్రిష్ణప్రసాద్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

కామేపల్లి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): రైతులను నట్టేట కాంగ్రెస్ ప్రభుత్వం ముంచిందని బీఆర్ఎస్ పార్టీ నాయకులు అంతోటి అచ్చయ్య, మూడ్ క్రిష్ణప్రసాద్ అన్నారు. సోమవారం మద్దిగూడెం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రైతులకు ఇచ్చిన హమీలు నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలం అయిందని అన్నారు. రైతు భరోసా, రైతు రుణ మాఫీ చేయలేదని కానీ అమలు చేశామని గొప్పలు చెప్పుకొంటున్నారని అన్నారు. అధికాకుండా రైతులకు రుణ మాఫీ చేయకుండా వడ్డీలు వసూలుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని విమర్శించారు. వడ్డీల వసూలు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో మల్లెంపాటి శ్రీనివాసరావు, కాత్రాల రాంబాబు, అజ్మీరా రాజు, అనంతరాములు, నాగులుమీరా, బత్తుల పుల్లయ్యచిప్పలపల్లి శ్రీనివాసరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థినులకు ల్యాప్‌టాప్‌ల పంపిణీ


ల్యాప్‌టాప్‌లు అందజేస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ మిలాన్‌మిశ్రా

రఘునాథపాలెం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): రఘునాథపాలెం బీసీ, ఎస్సీ బాలికల గురుకుల వసతిగృహంలో విద్యార్థినులకు అసిస్టెంట్ కలెక్టర్ మిలాన్‌మిశ్రా సోమవారం ల్యాప్‌టాప్‌లను పంపిణీచేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ల్యాప్‌టాప్‌లను సద్వినియోగం చేసుకోవాలని, ఉన్నతస్థాయి విద్యకు ల్యాప్‌టాప్‌లు ఎంతగానో ఉపయోగపతాయని సూచించారు. వసతిగృహంలో విద్యార్థినులకు అందుతున్న సౌకర్యాలను తెలుసుకున్నారు. ఆర్‌సీవో రాంబాబు మాట్లాడుతూ విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందించేందుకు కృషిచేసిన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్యకు కృతజ్ఞతలు తెలిపారు.

పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి

» తహసీల్దార్‌కు బీఎస్పీ, ఎమ్మెస్పీ నాయకుల వినతి

తిరుమలాయపాలెం, ఫిబ్రవరి24 (ఆంధ్రజ్యోతి): ముండలంలోని అజ్మీరతండాలో అంబేద్కర్ చిత్రపటాన్ని కిందపడేసిన పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో తహసీల్దార్ పీవీ రామకృష్ణకు బీఎస్పీ, ఎమ్మెస్పీ నాయకులు వినతిపత్రం అందించారు. తండాలోపంచాయతీ కార్యలయ ఆవరనలోని అంబేద్కర్ చిత్రపటాన్ని కింద పడేసి అవమానించిన కార్యదర్శిపై తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొమ్ము పూలే, పగిడపల్లి బాబు తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థినుల ప్రతిభ


విద్యార్థినులను అభినందిస్తున్న దృశ్యం

ఖమ్మం స్పోర్ట్స్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఈనెల 23న భద్రాద్రి కొత్తగూడెంలో జరిగిన ఏపీ, తెలంగాణ రెండు రాష్ట్రాల స్థాయి ఓపెన్ కరాటే పోటీలలో తమ పాఠశాల విద్యార్థినులు యాస్మిన్‌బేగం, మధులిత, విష్ణువర్ధిని, స్వాతి, రేష్మ ప్రతిభ చూపి బహుమతులు సాధించారని బాలాజీ నగర్ ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం కె. శ్రీనివాసరావు తెలిపారు. ఈసందర్భంగా సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో విద్యార్థినులను అభినందించారు. భవిష్యత్ పోటీలలోరాణించి ఖమ్మం జిల్లాకు ఖ్యాతిని తీసుకురావాలని ఆకాంక్షించారు.

కోజెంట్ ఈకి 'ఆర్జేసీ' విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో కళాశాల చైర్మన్ కృష్ణ

ఖమ్మం ఖానాపురంహవేలి ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సర్వీసెస్ సంస్థ కోజెంట్ ఈకి నగరంలోని ఆర్జేసీ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఏడుగురు ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. సోమవారం నగరంలోని ఎస్‌బీఐటీ కళాశాలలో నిర్వహించిన ఆఫ్ క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో యాక్సిస్ బ్యాంక్‌కు అనుబంధంగా బ్యాంకర్ పోస్టులకు విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు.ప్రత్యేక శిక్షణను అందించి వారి భవిష్యత్తుకు ఆలంబనగా ఉద్యోగ కల్పన చేకూరేలా బోధన అందిస్తున్నట్లు తెలిపారు.

శ్రీనివాస్‌కు పలువురి నివాళి

నేలకొండపల్లి, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వ్యక్తిగత సహాయకుడు శ్రీనివాస్ మృతదేహాన్ని మండల కాంగ్రెస్ నాయకులు సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబానికి సంతాపం తెలిపారు. కాంగ్రెస్ సేవాదళ్ పాలేరు నియోజకవర్గ నాయకుడు బచ్చలకూరి నాగరాజు, కాంగ్రెస్ దళిత నాయకుడు సూరేపల్లి రామారావు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

కేవీపీఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శిగా శ్రీను

తిరుమలాయపాలెం, ఫిబ్రవరి24 (ఆంధ్రజ్యోతి): కేవీపీఎస్ పాలేరు డివిజన్ కార్యదర్శిగా తిరుమలాయపాలేనికి చెందిన కొమ్ము శ్రీను ఎన్నికయ్యారు. ఆదివారం ఖమ్మం రూరల్ మండలం నాయుడుపేటలో కేవీపీఎస్ డివిజన్ సదస్సు జరిగింది. ఈసందర్భంగా కేవీపీఎస్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కొమ్ముశ్రీనును పాలేరు డివిజన్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. శ్రీను ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ కార్యదర్శిగా అనేక ఉద్యమాలు నిర్మించడంలో కీలక పాత్ర పోషించారు.

ఆలయాలకు భూమి పూజ

కామేపల్లి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): కామేపల్లి మండల పరిధిలోని మద్దిగూడెం గ్రామంలో అభయాంజనేయ స్వామి, ముత్యాలమ్మ తల్లి నూతన ఆలయాల నిర్మాణాలకు సోమవారం భూమి పూజ నిర్వహించారు. పురోహితులు వేద మంత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య పాల్గొని నవధాన్యాలు చల్లారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ కమిషన్ డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, నాయకులు నర్సింహరెడ్డి, లక్ష్మయ్య, రాంబాబు, నాగేశ్వరరావు, లక్ష్మినారాయణ, బావ్‌సింగ్, మల్లయ్య, అనురాధ, రామక్రిష్ణ పాల్గొన్నారు.

ముస్తాబవుతున్న శివాలయాలు



నేరడ శివాలయం

చింతకాని, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నేరడ, కొదుమూరు, వందనం,పందిళ్లపల్లి, నాగులవంచ, నాగిలిగొండ గ్రామాల్లోని శివాలయాలు మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబయ్యాయి. నేరడ గ్రామంలోని శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో మూడు రోజుల పాటు వైభవంగా జాతరను నిర్వహిస్తారు. జాతరలో ప్రతి ఏటా నేతాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే రెండు రాష్ట్రాల స్థాయి కబడ్డీ పోటీలు జాతరకు మరింత ఆకర్షణగా నిలుస్తున్నాయి. డాన్స్‌బేబీ డాన్స్‌షోలు కూడా నిర్వహిస్తున్నట్లు నేతాజీ యువజన సంఘం బాధ్యులు తెలిపారు.

వందనం గ్రామంలోని అతి పురాతన శివాలయమైన స్వయంభు రామలింగేశ్వరస్వామి ఆలయంలో కన్నుల పండుగగా శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తారు. జాతరకు పందిళ్లు, తీర్థప్రసాదాలకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు.

ఏన్కూర్‌లో..

ఏన్కూరు, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): మండలంలోని బురదరాఘవాపురం శివాలయంలో ఈనెల 26న మహాశివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఆలయకమిటీ ఏర్పాట్లు చేస్తుంది. సుమారు 250 ఏళ్లనాటి అతిపురాతనమైన శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి శివాలయంలో నాటి నునండి నేటివరకు నిత్యం దీపదూప ఆరాధన జరుగుతుంద.ఇ ఈనెల 26న బుధవారం ఉదయం భక్తులు గోత్రనామాలతో అష్టోత్తర శతక నామం పూజాకార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, సాయంత్రం శివపార్వతుల కళ్యాణం నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్టు ఆలయ కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది.

వైరాలో శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయం

వైరా, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): వైరా మండలంలోని స్నానాల లక్ష్మీపురంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయం మహాశివరాత్రి జాతర ఉత్సవాలకు ముస్తాబైంది. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క స్వగ్రాంలోని ఈ ఆలయంలో పెద్ద ఎత్తున మహాశివరాత్రి జాతర ఉత్సవాలు జరుగనున్నాయి. భట్టి విక్రమార్క, నందిని దంపతులు ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, లలిత దంపతులు బుధవారం రాత్రి శివపార్వతుల కల్యాణ మహోత్సవ వేడుకలను స్వయంగా నిర్వహించనున్నారు. డిప్యూటీ సీఎం రానుండటంతో పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు. వైరా మండలంతోపాటు ఏపీలోని ఎన్టీఆర్ జిల్లాలోని గంపలగూడెం మండలం సహా ఆరేడు మండలాలకు చెందిన వేలాదిమంది భక్తులు బుధవారంవేకువజామునే స్నానాల లక్ష్మీపురం చేరుకొని రామలింగేశ్వరస్వామి ఆలయానికి ఎదురుగా ఉన్న వైరా నదిలోని రామగుండంలో పుణ్యస్నానాలు ఆచరించనున్నారు. ఈ ఏడాది కాలంలో అశువులు బాసిన వారి బంధుమిత్రులకు పిండప్రధానం చేసి అంటు తీర్చుకోనున్నారు. ఆలయంలో భక్తుల కోసం క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడపనున్నారు. నీటిపారుదల శాఖ అధికారులు రిజర్వాయర్ ఎడమ కాల్వ నుంచి భక్తుల స్నానాల కోసం వైరా నదికి నీటిని విడుదల చేశారు. వైరా ఏసీపీ ఎంఏ.రెహ్మాన్ ఆధ్వర్యంలో సీఐ సాగర్, పలువురు ఎస్‌ఐలు సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటుచేయనున్నారు.



రామలింగేశ్వరస్వామి ఆలయం



చిన్నకోరుకొండిలో మల్లిఖార్జునస్వామి ఆలయం

కల్లూరులో...

కల్లూరు, ఫిబ్రవరి24 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి మహోత్సవాల సందర్భంగా కల్లూరు మండల పరిధిలోని చిన్నకోరుకొండి, చెన్నూరు గ్రామాల్లో గల భ్రమరాంబ సమేత మల్లిఖార్జున స్వామి (శివాలయం), శ్రీ గంగా శివపార్వతుల ఆలయాలు ముస్తాబయ్యాయి. చిన్నకోరుకొండిలో గల భ్రమరాంబ సమేత మల్లిఖార్జున స్వామి వారి ఆలయాన్ని మాదిరాజు వంశస్థులు 135 ఏళ్ల క్రితం నిర్మించగా, కాల క్రమంలో ఆలయ శిథిలావస్థకు చేరడంతో అదే వంశానికి చెందిన మాదిరాజు నరిసింహారావు మనమలు, గ్రామస్థులు ముందుకు వచ్చి తిరిగి ఈ ఆలయాన్ని జీర్ణోద్ధరణ చేశారు. చెన్నూరులోని శ్రీ గంగ శివపార్వతుల ఆలయాన్ని కాకతీయపాలన కాలంలో రావికంపాడు మధిర బ్రాంచ్ కెనాల్‌పై గట్టున శ్రీ గంగా శివపార్వతల విగ్రహం వెలసినది. గ్రామస్థులు 30ఏళ్ల కిత్రం ఆలయాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా భక్తులను రాకను దృష్టిలో ఉంచుకొని ఆలయాల కమిటీల ఆధ్వర్యంలో అన్ని విధాలుగా ఏర్పాట్లు చేశారు.

నీలాద్రికి 25 ప్రత్యేక బస్సులు: డీఎం



మాట్లాడుతున్న ఆర్టీసీ డీఎం రాజ్యలక్ష్మి

సత్తుపల్లి/పెనుబల్లి ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా నీలాద్రీశ్వరాలయానికి ఆరోజు తెల్లవారుజాము నుంచి ప్రత్యేక బస్సులు నడిపిస్తామని సత్తుపల్లి ఆర్టీసీ డీఎం రాజ్యలక్ష్మి తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ నీలాద్రి పుణ్యక్షేత్రంలో జరుగు మహోత్సవాలను పురస్కరించుకుని 25ప్రత్యేక బస్సులను కేటాయించినట్లు తెలిపారు. రద్దీని బట్టి అదనపు బస్సులు నడిపిస్తామని చెప్పారు. పెద్దలకు రూ.50, పిల్లలకు రూ.30గా చార్జీలు నిర్ణయించామన్నారు. సత్తుపల్లి నుంచి కిష్టారం, లంకపల్లి, రామచంద్రాపురం మీదుగా నీలాద్రి చేరుకుంటాయని, తిరుగు ప్రయాణంలో మాత్రం రామచంద్రాపురం, ఏరుగట్ల మీదుగా మండాలపాడు చేరుకుని సత్తుపల్లికి బస్సులు వస్తాయని, ప్రయాణికులు గమనించి సద్వినియో గం చేసుకోవాలని కోరారు.

పుణ్యక్షేత్రానికి బస్సులు నడపనున్న నేపథ్యం లో ఆర్టీసీ డీఎం నీలాద్రీశ్వరుడిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ ఈవో పీవీ.రమణ ఆమెను ప్రత్యేకంగా సన్మానించారు.

విద్యుత్ సమస్యలు రాకుండా చూడాలి: ఎస్ఈ

మధిర రూరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సమస్యలు రాకుండా చూడాలని ఖమ్మం ఎస్ఈ ఏ.సురేంద్ర అన్నారు. సోమవారం బోనకల్ మండలం మోటమర్రి టాపింగ్ నుంచి మధిర మండలం సిరిపురం విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు నూతనంగా నిర్మించిన విద్యుత్‌లైన్లను ఆయన ప్రారంభించారు. మధిర, బోనకల్ మండలాలకు విద్యుత్ సరఫరా చేయాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశాలతో రూ.20లక్షలతో ఈ లైన్లను నిర్మించారు. ఈ సందర్భంగా ఎస్ఈ సురేందర్ మాట్లాడుతూ ఈ లైన్ల నిర్మాణంతో మధిర, బోనకల్ మండలాల ప్రజలకు మధిర 132కేవీ సబ్‌స్టేషన్ నందు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినప్పటికీ పెద్దగోపతి నుంచి ప్రత్యక్షంగా బోనకల్ మీదుగా సిరిపురం వరకు ప్రత్యామ్నాయంగా విద్యుత్ సరఫరా చేసే అవకాశం ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో వైరా డీఈ శ్రీనివాసరావు, ఏడీఈ అనురాధ, రూరల్ ఏఈ మైథిలి, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యుత్ లైన్లను పరిశీలిస్తున్న ఎస్ఈ సురేంద్ర

త్వరలోనే లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

» జిల్లా హౌజింగ్ ఈఈ శ్రీనివాస్

కారేపల్లి, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొత్తతండా గ్రామంలో త్వరలోనే ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లనిర్మాణ పనులు ప్రారంభిస్తామని జిల్లా హౌజింగ్ ఈఈ శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని కొత్తతండాలో ఇటీవల మంజూరైన లబ్ధిదారులకు సంబంధించిన ఇండ్లస్థలాలను పరిశీలన చేసినట్లు తెలిపారు. రూ. ఐదు లక్షల లక్షలతో ఇల్లు ఏవిధంగా నిర్మించుకోవాలో అనే విషయంపై లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. అర్హతగల కుటుంబానికి ఒకరికి మాత్రమే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో సురేందర్, ఎంపీవో రవీంద్ర ప్రసాద్, ఏఈ ఉమమాహేశ్వరరావు ,కార్యదర్శి హరి తదితరులు పాల్గొన్నారు.

గుత్తాను పరామర్శించిన మంత్రి తుమ్మల



గుత్తా కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి తుమ్మల

ఏన్కూరు, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకుడు గుత్తా వెంకటేశ్వరరావును సోమవారం మంత్రి తుమ్మల పరామర్శించారు. గుత్తా తండ్రి అనంతరామయ్య, ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మంత్రి జన్నారం గ్రామం వెళ్లి గుత్తా కుటుంబసభ్యులతో మాట్లాడారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈకార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు స్వర్ణనరేంద్రకుమార్, మేడికొండూరు ప్రసాద్, యండ్రాతి శ్రీనివాసరావు, రేగళ్ల నాగయ్య, శోభన్‌నాయక్, కట్టా సత్యనారాయణ పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణ బోర్డు సమావేశంలో ఎమ్మెల్యే



సమావేశంలో మంత్రి సురేఖతో ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ అధ్యక్షతన సోమవారం జరిగిన వన్యప్రాణుల సంరక్షణ బోర్డు సమావేశంలో బోర్డు సభ్యుడు మాలోతు రాందాస్‌నాయక్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో అనేక అంశాలపై చర్చించారు. పలు ప్రతిపాదనలు చేశారు.

ఎల్ఈడీ అందజేత

కొణిజర్ల, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అన్నవరం గ్రామ అంగన్‌వాడీ కేంద్రానికి జిల్లా ఎన్ఆర్ఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఎల్ఈడీ టీవీని అందజేశారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో కమలప్రియ, ఉషారాణి, సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ పుష్పావతి, టీవీ రావటానికి కారణమైన అక్కడ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అచ్చుత్, బాలయేసు తదితరులు పాల్గొన్నారు. ఎన్ఆర్ఐ సభ్యులకు అచ్చుత్ కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీనివాస్ మృతి పట్ల పలువురు నాయకుల నివాళి

బోనకల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వ్యక్తిగత సహాయకుడు శ్రీనివాస్ మృతి పట్ల మండల కాంగ్రెస్ నాయకులు సంతాపం తెలిపారు. ఖమ్మంలో సోమవారం మృతదేహాన్ని పీసీసీ సభ్యుడు పైడిపల్లి కిషోర్ కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాలి దుర్గారావు, ఆత్మ కమిటీ ఛైర్మన్ కర్నాటీ రామకోటేశ్వరరావు, మాజీ జడ్పీటీసీ మోదుగు సుధీర్‌బాబు, చేబ్రోలు వెంకటేశ్వర్లు, చేబ్రోలు రమ, కందుల పాపారావు తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

వినూత్న బోధనతో సన్నద్ధం కావాలి: ఎంఈవో

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): తరగతి గదిలో వినూత్న బోధనా, వ్యూహాలతో ఉపాధ్యాయులు సన్నద్ధమవ్వాలని ఎంఈవో నక్కా రాజేశ్వరరావు సూచించారు. ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యాశాస్త్రం నైపుణ్యం (ఎఫ్ఎల్ఎన్) కార్యక్రమంలో భాగంగా రాష్ట్రప్రభుత్వం పైలట్ ప్రాజెక్టు కింద పట్టణంలోని ఎన్టీఆర్ ప్రాథమిక పాఠశాల ఎంపికైంది. ఈ సందర్భంగా సోమవారం కంప్యూటర్ ల్యాబ్‌ను ఎంఈవో ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. విద్యార్థులకు బలమైన పునాది, నైపుణ్యాలను పెంపొందించడంలో సహాయపడటానికి ఉపాధ్యాయులకు అనుభవం, ప్రభావవంతమైన బోధన విధానాలను అందించడంపై దృష్టి పెడుతున్నామన్నారు. నివేదికల ఆధారంగా తెలుగు, గణితం, ఇంగ్లీషు వంటి సబ్జెక్టుల్లో విద్యార్థులకు కనీస జ్ఞానం ఉండటం లేదని, విద్యార్థి ప్రాథమిక స్థాయి నుంచే అభ్యసనా సామర్థ్యాలు మెరుగుపరుచుకునేలా చర్యలు చేపట్టేందుకు ఈ ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని ప్రభుత్వం ముందుకు తీసుకొచ్చిందన్నారు. ప్రతి విద్యార్థిలో కనీస అభ్యసన సామర్థ్యాలు పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని, ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని అమలు చేయడం ద్వారా విద్య నాణ్యతను మెరుగుపరచడంలో ఉపాధ్యాయుని పాత్ర అత్యంత కీలకమన్నారు.



కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఎంఈవో రాజేశ్వరరావు

హైదరాబాద్‌కు చెందిన నోస్ ల్యాబ్ నిర్వహకులు పాఠశాలకు రూ.4.25లక్షల విలువైన ఫర్నీచర్‌ను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాలకు నోస్ ల్యాబ్ నిర్వహకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం శైలకుమారి, హెచ్ఎం సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు కృష్ణారావు, లాల్‌అహ్మద్, శేషుకుమార్, నర్సింహారావు, వెంకటేష్, విజయ పాల్గొన్నారు.

అందరికీ రుణమాఫీ చేయాలి

» సీపీఐ జాతీయ సమితి సభ్యుడు హేమంతరావు

వైరా, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు రూ.రెండులక్షల రుణమాఫీ 40శాతం మంది రైతులకే చేసిందని మిగిలిన 60శాతం మంది రైతులకు రుణమాఫీ ఎప్పుడు చేస్తారని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు ప్రశ్నించారు. వైరాలోని కమ్మవారి కల్యాణ మండపంలో సోమవారం జరిగిన రైతు సంఘ సమావేశం ఆతర్వాత విలేకరులతో ఆయన మాట్లాడుతూ మార్చి 30న వైరాలో రైతుసంఘం సభ నిర్వహిస్తామని ప్రకటించారు. హేమంతరావు మాట్లాడారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నల్లచట్టాలు తీసుకువచ్చిందని, రైతుసంఘాల పోరాటాలతో వాటిని రద్దు చేసిందని తెలిపారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా రైతు సమస్యల పరిష్కారంలో విఫలమైందని విమర్శించారు. రైతుసంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొండపర్తి గోవిందరావు, దొండపాటి రమేష్, నాయకులు యర్రా బాబు, అడపా రామకోటయ్య, జమ్ముల జితేందర్‌రెడ్డి, యామాల గోపాలరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

తల్లాడ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిగూడెం వద్ద సోమవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడు మృతి చెందాడు. ఈ ప్రమాదంలో మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన మూకర ఎర్రయ్య(76)అనే వృద్ధుడు మృతి చెందాడు. రెడ్డిగూడెం నుంచి నారాయణపురం గ్రామానికి ఎర్ర య్య నడుచుకుంటూ వస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొన దంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుమారుడు సుదర్శన్ ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ జేవీఆర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చివరి భూముల వరకు సాగునీరు అందిస్తాం

» కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



వరిపంటను పరిశీలిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పెనుబల్లి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): రైతుల పంట పొలాలకు సాగునీటి విడుదల సమయంలో చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందేలా అధికారులు దృష్టి సారించాలని కలెక్టర్ ముజమ్మిఖాన్ అన్నారు. సోమవారం కలెక్టర్ పెనుబల్లి మండలంలోని టేకులపల్లి గ్రామంలో సాగు చేసిన వరి పైరును క్షేత్ర స్థాయిలో పొలం గట్లపై రెండు కిమీ నడిచి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైతులతో ముచ్చటించారు.

పది పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలి

విద్యార్థులు పదవ తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాల సాధన కోసం ప్రణాళిక బద్ధంగా కృషి చేయాలని కలెక్టర్ ఉపాధ్యాయులను కోరారు. మండల పరిధిలోని టేకులపల్లి ఆదర్శ పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ కార్యక్రమంలో జలవనరులశాఖ కల్లూరు సర్కిల్ ఎస్సీ వాసంతి, వ్యవసాయశాఖ ఏడీ శ్రీనివారెడ్డి, తహసీల్దార్ సుధీర్, ఎంపీడీవో అన్నపూర్ణ, ఏవో ప్రసాదరాజు, ఎంఈవో సత్యనారాయణ, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రాంప్రసాద్ పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

వల్లాపురంలో మొక్కజొన్న పంట పరిశీలన

వైరా, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): వల్లాపురంలో మొక్కజొన్న పంటలను వైరా ఏడీఏ తుమ్మలపల్లి కరుణశ్రీ, ఏవో మయాన్ మంజూఖాన్‌లు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎండిపోతున్న తమ మొక్కజొన్న పంటకు వెంటనే సాగర్‌జలాలు విడుదల చేసి కాపాడాలని వల్లాపురం రైతులు వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐబీ ఏఈఈ హరికృష్ణ, ఏఈవో వాసంతీ, ఆదర్శ రైతు తుమ్మల రాణాప్రతాప్ పాల్గొన్నారు.

ధాన్యం కేంద్రాలను ఏర్పాటు చేయాలని వినతి

కల్లూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని హనుమతండ, వాచ్యానాయక్‌తండా గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సోమవారం గిరిజన రైతులు ఖమ్మంలో కలెక్టరేట్‌కు వెళ్లి అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందించారు. రైతుల అభ్యర్థనతో సానుకూలంగా స్పందించిన అదనపు కలెక్టర్ ధాన్యం కేంద్రాల ఏర్పాటుపై సహకరిస్తామన్నారు. సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయిని కూడా గిరిజన రైతులు కేంద్రాల ఏర్పాటుపై కలుసుకొగా సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, రైతులు భూక్యా శివకుమార్‌నాయక్, బానోతు పంతులు, బానోతు లాల్‌సింగ్, గుగులోతు హనుమ తదితరులు పాల్గొన్నారు.

'గ్రామంలో రోడ్డు వెడల్పును కుదించాలి'

చింతకాని, ఫిబ్రవరి 24: బోనకల్ మండల రావినూతల నుంచి చింతకాని మండలం పొద్దుటూరు గ్రామం వరకు చేపడుతున్న ఆర్ అండ్ బీ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా పొద్దుటూరు గ్రామంలో రోడ్డు వెడల్పును 50 అడుగుల నుంచి 28 అడుగులకు కుదించాలని బాధితులు సోమవారం జిల్లా కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్‌కు వినతిపత్రం అందజేశారు. రహదారి విస్తరణ వలన గ్రామంలో 139 గృహాలు రూపం కోల్పోతున్నాయని గృహాలు కోల్పోతున్న వారికి నష్టపరిహారం ఇవ్వాలన్నారు.

ఆయకట్టు భూములను కాపాడాలి

» రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు

కొణిజర్ల, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): సాగర్ ఆయకట్టు చివరి భూములకు సాగు నీరందేలా చూడాలని రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు కోరారు. సోమవారం రైతుసంఘం ఆధ్వర్యంలో మండలంలోని రాపల్లే మేజర్, సోమవరం మైనర్ కాల్వల కింద సాగు చేసిన పంటలను, నీళ్లరాని కాల్వలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు, రైతులు చింతనిప్పు నరసింహరావు, పిచ్చయ్య, నాగయ్య, రామారావు, నరసింహరావు, నరేష్, నారాయణ, పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదరికంలో ఉన్న పూర్వ విద్యార్థులకు చేయూత

తల్లాడ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): 39సంవత్సరాల తర్వాత కలుసుకున్న పూర్వవిద్యార్థుల అపూర్వ కలయిక పేదరికంలో ఉన్న వారిని ఆదుకుంటుంది. తల్లాడ జడ్పీఉన్నత పాఠశాలలో 1985-86 సంవత్సరంలో పదోతరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థులు పరస్పరం యోగక్షేమాలను పంచుకున్నారు. వీరిలో విజయ్‌కుమార్, బాబూరావు, ప్రభాకర్, వెంకటేశ్వర్లు, ముత్యాలు అనే ఐదుగురు పూర్వ విద్యార్థులు ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్న విషయాన్ని గుర్తించి వారి తోటి విద్యార్థి బండారు విశ్వనాథం తనవంతు సాయంగా ఒక్కొక్కరికి రూ.పదివేల చొప్పున ఆర్థిక సహాయాన్ని ప్రకటించి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరం తల్లాడ హైస్కూల్లో పదిలో ఉత్తీర్ణులైన ఇద్దరు విద్యార్థులకు ఇంటర్ చదివేందుకు అయ్యే ఖర్చును పూర్తిగా భరించేందుకు మరో పూర్వ విద్యార్థిని టి.సుశీల ముందుకువచ్చారు.

ఘనంగా లింగమంతులస్వామి జాతర

ముదిగొండ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ముదిగొండలో యాదవుల ఆధ్వర్యంలో లింగమంతులస్వామి జాతరను సోమవారం ఘనంగా నిర్వహించారు. ముదిగొండ పెద్దగుట్టపైగల లింగమంతులస్వామి ఆలయానికి గ్రామం నుంచి డప్పువాయిద్యాల నడుమ మహిళలు బోనాలతో ఊరేగింపుగా తరలివచ్చారు. ఆలయం వద్ద పాలపొంగళ్లు తయారుచేసి స్వామివారికి నైవేద్యాన్ని సమర్పించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ప్రశ్నించే గొంతుకను గెలిపించండి

» తెలంగాణ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్. రంజాన్

కొణిజర్ల, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ నియోజకవర్గం ఎన్నికల్లో ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల ఉమ్మడి అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డిని మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్ రంజాన్, ఏ.వి. నాగేశ్వరరావు కోరారు. సోమవారం కొణిజర్లలో జరిగిన ఆసంఘం సమావేశంలో వారు మాట్లాడారు. అవినీతిపరులుకు, అవకాశవాదులకు ఈ నియోజకవర్గంలో స్థానంలేదని నిరూపించాలన్నారు. నర్సిరెడ్డి మరోమారు గెలిస్తేనే ఓటరు గెలిచినట్లని లేనిచో మరో వ్యక్తి గెలిస్తే వెంటనే అధికార పార్టీలోకి చేరిపోయే అవకాశం ఉందన్నారు. నర్సిరెడ్డి చొరవతోనే బదిలీలు, పదోన్నతలు వచ్చాయని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు రవికుమార్, యుటీఎఫ్ మండల అధ్యక్షులు వీరస్వామి, మాదాల ప్రసాద్‌రావు, షేక్ ఖాదర్, హనుమ, జగ్గయ్య, సైదులు తదితరులున్నారు.

చింతకానిలో...

చింతకాని, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గంలో ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల ఉమ్మడి అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డికు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని టీఎస్ యూటిఎఫ్, టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శులు పారుపల్లి నాగేశ్వరరావు, తేజావత్ వెంగళరావు కోరారు. మండల పరధిలో ని నాగులవంచ గ్రామంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొన్నారు. విద్యా, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం అలుగుబెల్లి కృషి చేస్తున్నాడన్నారు. కార్యక్రమంలో నె ల్లూరి వీరబాబు, తోటకూరి శ్రీనివాసరావు, ఉదారపు నాగేశ్వరరావు, వలపర్ల కృష్ణ పాల్గొన్నారు.



కొణిజర్ల సమావేశంలో మాట్లాడుతున్న రంజాన్

బోనకల్‌లో...

బోనకల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో యూటీఎఫ్, టీపీటీఎఫ్ ఉమ్మడి ఎమ్మెల్సీ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డిని గెలిపించాలని ఆ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శులు పారుపల్లి నాగేశ్వరరావు, తేజావత్ వెంగళరావులు కోరారు. బోనకల్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత ఆరు సంవత్సరాలుగా ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడానికి తమ అభ్యర్థి నర్సిరెడ్డి అంకితభావంతో పని చేశారని తెలిపారు. ప్రలోభాలకు తావు లేకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో యూటీఎఫ్ జిల్లా మాజీ అధ్యక్షుడు నెల్లూరి వీరబాబు, జిల్లా కార్యదర్శి గుగులోతు రామకృష్ణ, టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ యాకుబ్ పాషా, చినరంగారావు, సదాబాబు, గోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.

వేంసూరులో...

వేంసూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ యూటీఎఫ్ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్.రంజాన్, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఏవీ.నాగేశ్వరరావు ఉపాధ్యాయులను కోరారు. మర్లపాడులో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల కోసం నిరంతరం పోరాడే నర్సిరెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రవికుమార్, నిర్మలకుమారి, ఉమామహేశ్వర్‌రెడ్డి, చంద్రశేఖర్, పకీర్, కె.శ్రీనివాసరెడ్డి, దీన్‌దయాల్, యాకోబుఅలి, రామశేషు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

కల్లూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాల్లో సోమవారం తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖ అభివృద్ధి సంస్థ ఛైర్మన్ మువ్వా విజయబాబు, ఎమ్మెల్యే రాగమయిలు పలు కుటుంబాలను పరామర్శించారు. చెన్నూరులో మాజీ ఏఎంసీ ఛైర్మన్ గొర్రెపాటి రాధయ్య విగ్రహనికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలగవరం గ్రామంలో కస్తాల రాధాకృష్ణ దశదిన కార్యక్రమంలో భాగంగా కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సీడీసీ ఛైర్మన్ కస్తాల నరేంద్ర, మాదాల గోపాలరావు, మట్టూరి జనార్ధన్, తోటకూర శేషగిరిరావు. యాసావెంకటేశ్వరరావు, మన్నె చంటి గొర్రెపాటి రఘురాం తదితరులు పాల్గొన్నారు.



రాధయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మువ్వా, నాయకులు

'చివరి భూములు తడిసే వరకు నీరందించాలి'

బోనకల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాయణపురం మైనర్ కాలువ కింద మక్క పంటలను సాగు చేస్తున్న రైతులు తమ చివర భూములు తడిసే వరకు నీరందించాలని కోరుతూ సోమవారం రైతు సంఘం ఆధ్వర్యంలో ఇరిగేషన్ కార్యాలయం ఎదుట గల వైరా-జగ్గయ్యపేట ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘ నాయకులు మాట్లాడుతూ వారబందీ విధానం వలన మైనర్ కాలువల కింద సాగు చేస్తున్న చివర భూములకు సక్రమంగా నీరందడం లేదన్నారు. ఇరిగేషన్ అధికారులు చివర భూములు తడిసే వరకు నీళ్లు అందిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు చింతలచెర్వు కోటేశ్వరరావు, దొండపాటి నాగేశ్వరరావు, కిలారు సురేష్, కూచిపూడి మురళి, కోట నాగరాజు, బంధం శ్రీనివాసరావు, ఉప్పర శ్రీను, గుగులోతు నరేష్ పాల్గొన్నారు.



బోనకల్‌లో రాస్తారోకో చేస్తున్న రైతులు

పోలింగ్ స్టేషన్ పరిశీలన

బోనకల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): బోనకల్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్‌ను సోమవారం జోనల్ అధికారి కడారు విజయభాస్కరరెడ్డి, తహసీల్దార్ అనింశెట్టి పున్నమ్ చందర్, గిర్దావర్ గుగులోతు లక్ష్మణ్‌లు పరిశీలించారు. వసతులను పర్యవేక్షించారు. మండలంలో 33 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. పోలింగ్ సంబంధించి ముం దస్తుగా అన్ని ఏర్పాట్లను సమర్థవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు.